తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ళ ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026

## శ్రీవారిని దర్శించుకున్న సిఈసి జ్ఞానేష్ కుమార్



తిరుమల,మే 9ప్రభాతవార్తప్రతినిధి: కుటుంబ ఓటర్లందరికీ ఇది ఒక శుభదినమని, విజయవంతమైన ఎన్నికల నిర్వహణకు ఇది నూతన ఆరంభంగా భావిస్తున్నానని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం తిరుమల శ్రీవారి ఆలయంలోనికి సిఈసి జ్ఞానేశ్‌కుమార్ దంపతులు చేరుకున్నారు. టిటిడి జెఈఓ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, తిరుమల డిఎస్పీ విజయశేఖర్ స్వాగతం పలికారు. ఆలయంలోపల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అదికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## దొరవేషంలో గంగమ్మ



తిరుపతి,మే 9ప్రభాతవార్త: తిరుపతి నగరగ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ జాతరవేడుకల్లో శనివారం దొర వేషంతో అమ్మవారు వైభవంగా దర్శనమిచ్చారు. ఈ వేషాన్ని కైకాల, చాకలి కులస్తులు అనువంశికంగా నిర్వహించడం ప్రత్యేకతగా నిలుస్తోంది. శనివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేపట్టి, ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్, ఆలయ ఈఓ ఎ.జయకుమార్,సభ్యులు భక్తులకు సకల సౌకర్యాలు కల్పించారు.

## రెండోఘాట్‌లో బస్సుల తనిఖీకి
# అధునాతన ఏర్పాట్లు
### -టోల్‌గేట్ దాటాక ప్రత్యేక "బస్‌బే"




ప్రభాతవార్తప్రతినిధి–తిరుమల: తిరుమలకు వస్తున్న లక్షలాదిమంది యాత్రికులు తమ వాహనాలను,లగేజీలను అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రంలో తనిఖీ చేసుకోవడం జరుగుతుంది. ఇదే సమయంలో సామాన్యభక్తులు కూడా పలు రకాలుగా తిరుపతికి చేరుకుని తిరుమలకు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. ఇలా ప్రయాణించే వారిని ఇకపై సప్తగిరి తనిఖీ కేంద్రం వద్ద దిగి తనిఖీ చేసుకోవాల్సిన అవసరం లేదు. ఆర్టీసి బస్సులన్నీ టోల్‌గేట్ దాటిన తరువాత వచ్చే వరసిద్ధివినాయకస్వామి ఆలయం సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేస్తున్న బస్‌బేలో చేరుకుని తనిఖీ చేసుకోవాల్సి రానుంది. ఇప్పటికే ప్రతిరోజూ 450 వరకు ఆర్టీసి బస్సులు తిరుమల–తిరుపతి,తిరుపతి–తిరుమల మధ్య నడుస్తున్నాయి. 40వేలమంది వరకు యాత్రికులు ప్రయాణిస్తున్నారు. అలిపిరి తనిఖీకేంద్రంలో వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఇక్కడ బస్సులు దిగిన ప్రయాణీకులు/భక్తులు తిరిగి అదే బస్సులను ఎక్కడంలో అవస్థలు పడుతున్నారు. కొన్ని సమయాల్లో బస్సులు తప్పిపోతున్నారు. దీంతో ఈ తనిఖీలను మరింత సాఫీగా సులభంగా వినాయకస్వామి గుడివద్ద చేపట్టేందుకు బుధవారం టిటిడి బోర్డు కూడా అమోదించింది. అలిపిరి టోల్‌గేట్‌లో వేకువజామున 3గంటల నుండి అర్ధరాత్రి 12గంటల వరకు వాహనాలను అనుమతిస్తున్నారు. దేశం నలుమూలల నుండి వస్తున్న యాత్రికులతోబాటు 10వేలకుపైగా వాహనాలు, 450వరకు ఆర్టీసి బస్సులు, రెండువేల వరకు స్థానిక వాహనాలు,ట్యాక్సీలు, మరో వెయ్యివరకు ద్విచక్రవాహనాలు ఇలా పెద్దసంఖ్యలో అలిపిరి టోల్‌గేట్ దాటుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. బస్సులను ఇకపై వినాయకగుడి వద్ద బస్‌బేలో తనిఖీలు చేయాలని నిర్ణయించడం విశేషం. 12లేన్లను 15లేన్లుగా విస్తరించడానికి చర్యలు చేపడుతున్నారు.

## స్థానిక ఎన్నికలపై
# జనసేన ఫోకస్



తిరుపతి విద్య, మే 9 ప్రభాత వార్త తిరుపతిలో శనివారం జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలు,డిలిమిటేషన్ కమిటీ సభ్యులు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే ఆరాణి శ్రీనివాసులు, అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల పీఓసీలు,ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో జరుగుతున్న వార్డులు, డివిజన్ల డిలిమిటేషన్‌పై విస్తృతంగా చర్చించారు.జనసేన బలంగా ఉన్న వార్డులు, డివిజన్లను గుర్తించి అవసరమైన మార్పులు ఉంటే ఈ నెల 13వ తేదీలోపు కమిటీకి నివేదిక అందించాలని బాలినేని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు వెలువడిన వెంటనే జనసేన పోటీ చేసే స్థానాలను ప్రకటించేలా అధిష్టానం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఎన్డీఏ కూటమిలో స్థానాల పంపకంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర నాయకత్వం చర్చించి నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు.రాయలసీమలో జనసేనను బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని బాలినేని స్పష్టం చేశారు. పార్టీ నేతలు గ్రూపులు వీడి ఐక్యంగా పనిచేస్తేనే కూటమిలో జనసేనకు మరింత ప్రాధాన్యం పెరుగుతుందని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే ఆరాణి శ్రీనివాసులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన వందశాతం స్ట్రైక్ రేట్‌ను స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగించాలన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా నాయకులు కలిసి పనిచేస్తే స్థానిక ఎన్నికల్లో జనసేన చరిత్ర సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సరైన అభ్యర్థులను గుర్తించి పార్టీ బలమైన వార్డుల్లో విజయాన్ని ఖాయం చేయాలని నేతలకు సూచించారు.ఈ సమావేశంలో డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, సుంకర శ్రీనివాస్, రాందాస్ చౌదరి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేవతామూర్తుల దివ్యదర్శనం .. పరవశించిన భక్తజనం
### దేవేరులతో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శ్రీనివాసుడు .. ముగిసిన కల్యాణ వెంకన్న వార్షిక వసంతోత్సవాలు







చంద్రగిరి, మే 9 ప్రభాతవార్త: స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రం రోజున శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శ్రీనివాసుడు తమ దేవేరులతో కలసి రాగా దేవతామూర్తుల దివ్యదర్శనంతో భక్త జనం పరవశించిపోయారు. శ్రీనివాస మంగాపురంలో వార్షిక వసంతోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ రంగకుమార్, నారాయణాచార్యులు ఆధ్వర్యంలో 8.30 గంటల నుండి 9.30 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి, శ్రీసీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్ర స్వామి, శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి వారి ఉత్సవమూర్తులకు వసంత మండపంలో ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం 1.45 గంటల నుండి సాయంత్రం 3.30 గంటల వరకు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రాజోపచారాల అనంతరం పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనం, సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం (అభిషేకం) నిర్వహించారు. చక్రధార, శంఖధార, సహస్రధార, మహాకలశాభిషేకం వేఖానస ఆగమోక్తంగా నిర్వహించారు. తదుపరి పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం, తదితర వేదమంత్రోచ్ఛారణల నడుమ 7 రకాల సుగంధభరిత పుష్పమాలలతో ముమ్మూర్తులను, అమ్మవార్లను విశేష అలంకరణలతో తీర్చిదిద్ది ఊంజల్‌పై అధిష్టింపజేశారు. ఊంజల్‌పై సేదదీరిన దేవేరులు తమ దివ్యమైన దర్శన భాగ్యంతో భక్తులను అనుగ్రహించారు. అనంతరం మేళతాళాలు భక్తుల గోవిందనామస్మరణల నడుమ వీధి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, అనుంబట్టు ధనశేఖర్, జమేధార్ రమణ, అర్చక బృందం పాల్గొన్నారు.

## రోడ్డును బాగు చేయించండి సారూ!!



కుప్పం ,మే 9 ప్రభాతవార్త మండలంలోని వాన గుట్టపల్లి పంచాయతీ రాగిమాను మిట్ట గ్రామానికి వెళ్లే రహదారిని బాగు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామానికి వెళ్లే దారి అక్కడక్కడ గుంతల మయమై వాహనాలు వెళ్లేందుకు సైతం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామస్తులు పేర్కొన్నారు. రాత్రిపూట వాహనాల్లో వెళ్లాలంటే చాలా అవస్థలు పడాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి గ్రామానికి వెళ్లే రోడ్డును బాగు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సీమ అభివృద్ధికి కీలకం రైల్వే ప్రాజెక్టులు



రేణిగుంట మే 9 ప్రభాతవార్త రాయలసీమ అభివృద్ధికి కీలకం రైల్వే ప్రాజెక్టులని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి పూల వెంకటాద్రి యాదవ్ అన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల అభివృద్ధిని తెలియపరుస్తూ రాయలసీమ గొప్పతనాన్ని యాదవ్ వివరించారు. ఒకనాడు రతనాలసీమగా ఖ్యాతిగాంచిన రాయలసీమ నందు అపూర్వ సహజ వనరులతో పాటు ఎంతో సారవంతమైన భూములు ఉన్నాయన్నారు. రాయలసీమకు పూర్వవైభవం రావాలంటే పారిశ్రామిక, రవాణా రంగాలను బలోపేతం చేయాలన్నారు. రాయలసీమలో రైల్వే జోన్, రైల్వే డివిజన్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. తద్వారా ఎంతోమంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సీమప్రాంతానికి బుల్లెట్ రైళ్లు, గూడ్స్ వ్యాగన్ రైళ్లు, బ్రాడ్ గేజ్ లైలా విస్తరణ అవసరమన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువుతీరిన తిరుపతిని ప్రత్యేక రైల్వే జోన్ గా ప్రకటించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు..

# ప్రతి గ్రామానికి సిమెంటు రోడ్డు: శ్మశానాల అభివృద్ధి
### ఐదేళ్ళ పాలనలో మండలాబివృద్ధి.... కూటమి వచ్చిన తరువాత దేశం నాయకుల పెత్తనం





మండల కార్యాలయాల సముదాయంలో నూతన ఐసిడియస్ భవనం, .గ్రామీణ రోడ్లు నిర్మిణం

**మండలాల్లో సర్పంచ్‌ల శకం ముగిసింది. మరో మూడు నాలుగు నెలల్లో ఎంపిటిసిల పరిపాలన ముగుస్తుంది. ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేకాధికారుల పాలన సాగుతుంది. గతంలో ఎన్నికలు జరిగినపుడు వైకాపా అధికారంలో ఉంది. నాడు ఎన్నికలు ప్రహసనంగా మారాయి. ఎవ్వరిని నామినేషన్లు వేయనీయలేదు. అంతా పార్టీ కార్యాలయంలో ఏక గ్రీవాలు,భారీ ఎత్తున సర్పంచ్‌లు,ఎంపిటిసిల పదవుల వ్యాపారం విచ్చల విడిగా సాగింది. అయితే రెండేళ్ళ క్రితం కూటమి వచ్చింది.మూడేళ్ళ పాటు మండలాధ్యక్షులు వైకాపా హాయాంలో పలు పథకాల సొమ్ములు రాకుండా ఇబ్బంది పడ్డారు. కూటమి వచ్చిన తరువాత పంచాయతీలకు నిధులు వచ్చాయి. పథకాల అమలులో చలనం వచ్చింది. ఈ నేపధ్యంలో తొట్టంబేడు మండలాధ్యక్షురాలు ఉన్నం నిర్మల ఐదేళ్ళలో జరిగిన అభివృద్ధి గురించి ఇలా తెలిపారు.**

(ప్రభాతవార్త–తొట్టంబేడు) ఐదేళ్ళ పరిపాలనలో మండలంలో ఎన్నో దశాబ్దాల నుంచి అబివృద్ధికి నోచుకోని రోడ్లకు మహర్దశ కల్పించామని ఎంపిపి నిర్మలమ్మ అన్నారు. ముఖ్యంగా పలు గ్రామాలకు గతంలో సరైన రోడ్లు లేవని తమ పాలనలో వాటికి నిధులు కేటాయించటమే కాకుండా అమలు చేసి నేడు సిమెంటు రోడ్లతో కళ కళ లాడుతున్నాయని వివరిం చారు. అంత కాక గ్రామాల్లో అంతర్గత రోడ్లు కూడా నిర్మించామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా వచ్చిన నిధులను సద్వినియోగం చేసామన్నారు. పరిపాలనలో తనకు తన భర్త ఉన్నం వాసుదేవనాయుడు మార్గదర్శకంగా వ్యవహారించారని నిర్మలమ్మ వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గొట్టిపూడి గ్రామానికి రోడ్డు సదుపాయం లేక ఇబ్బందులు పడే వారని తాము అధికారం చేపట్టిన తరువాత రూ.1.6కోట్లతో రోడ్డు సదుపాయం కల్పించాము. అలాగే రాంభట్లపల్లి–గొట్టిపూడి మధ్య రోడ్డును రూ.1.8కోట్లతో చిన్నసింగమాల–పొయ్య– మల్లిగుంటకు రూ.4,85కోట్లుతో 8కిలో మీటర్ల రోడ్డును నిర్మించామన్నారు. అలాగే మల్లిగుంట–చిట్టత్తూరు– కజారియా–తంగేళ్ళ పాళెం రోడ్డు 7.5 కిలో మీటర్లు రూ.4.8కోట్లతో నిర్మించామన్నారు.ఈ రోడ్డు నిర్మాణంతో నాయుడుపేట–కెకెజి రోడ్డు నిర్మించటంతో భారీ వాహనాలకు అనుకూలంగా ఉందన్నారు.కాళంగి–బైరాజ్‌కండ్రిగ– చిట్టత్తూరు మీదుగా రోడ్డును రూ.1కోటితో నిర్మించామన్నారు.అలాగే కెకెజి– చేమూరు రోడ్డును రూ.35లక్షలు కనపర్తి–గుర్రప్ప నాయుడు కండ్రిగ రూ.24లక్షలతో పొయ్య కొత్తురు రోడ్డును రూ.22లక్షలతో నిర్మించినట్లు తెలిపారు. కాగా మండల గ్రాంటులో ద్దైనేడులో రూ.4లక్షలతో, కురవకన్నేరిలో సిసి రోడ్డు రూ 16లక్షలతో నిర్మించామన్నారు.



నిర్మలమ్మ

ప్రతి గ్రామానికి మంచినీరు

శ్మశానం లేని గ్రామాలకు శ్మశానం:

తమ ఐదేళ్ళ పాలనలో ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. అలాగే మంచినీటి సదుపాయానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు.గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా ప్రతి ఏడాది రూ.10నుంచి 15లక్షల బడ్జెట్‌ను కేటాయించి బోర్లకు సంబంధించిన మెటీరియల్స్‌నుకొనుగోలు చేసినట్లు వివరించారు.పొయ్య,పెద్ద కన్నలిలో శ్మశానాల్లో బరింగ్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు.ఇవి కాకుండా జాతీయ ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో రోడ్లను నిర్మించి అందంగా తీర్చి దిద్దామన్నారు.పలు గ్రామాల్లో మంచినీటి సరఫరాకు సంబంధించిన పైప్‌లైన్లు ఇబ్బందిగా ఉండగా వాటిని పరిష్కరించామన్నారు.

కూటమి వచ్చిన తరువాత దేశం పెత్తనం అధికమైంది.

కూటమి వచ్చిన తరువాత మండల తెలుగుదేశం నాయకుల పెత్తనం అధికమైందన్నారు. అభివృద్ధికి నిదులు అయితే వచ్చాయి కానీ ఎంఎల్ఏకి తెలుసో తెలియదో కానీ మండల నాయకుల పెత్తనం పెచ్చుపెరిగిందన్నారు.మండల గ్రాంటు, జనరల్ ఫండ్స్‌కు సంబంధించి చెరి సగమయ్యాయి. అంతేకాదు తాము గతంలో తెలుగుదేశం నాయకులు చేసి బిల్లులు చెల్లించకుండా ఉంటే వాటిని కూడా చెల్లించాము.శ్రీకాళహస్తి శాసనసభ్యుడుగా బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఉన్నపుడు ఎప్పుడూ ప్రతిపక్షాల వారిపై కక్ష సాధింపు చేయ లేదు. పరిపాలనలో జోక్యం చేసుకోలేదు.కానీ ప్రస్తుతం పరిస్థితి తద్విరుద్ధంగా మారిందని మండ లాధ్యక్షురాలి భర్త ఉన్నంవాసుదేవనాయుడు వివరించారు.

కేంద్ర నిధులే తప్ప రాష్ట్ర ప్రభుత్వ నిధులెక్కడ? వాసుదేవనాయుడు

ఈ సందర్భంగా మండలాధ్యక్షురాలు నిర్మలమ్మ భర్త ఉన్నం వాసుదేవనాయుడు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కేంద్రం నుంచి వచ్చే పథకాలే తప్ప రాష్ట్ర జవాబుదారి తనం లేదు. జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామాల అభివృద్ధికి ఓ వరం అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఎలాంటి నిధులివ్వకపోగా ఆ పార్టీ పెత్తనం పెచ్చుపెరిగిందన్నారు. ఐదేళ్ళ పాలన ఎలాంటి వివాదాలు, విమర్శలు, ఆరోపణలకు అతీతంగా సాగటానికి సహాకరించిన ప్రతి ఒక్క అధికారి నాయకులకు ధన్యవాదాలని తెలిపారు.

# కుప్పాన్ని మోడల్ మున్సిపాలిటీ చేయడమే లక్ష్యం



## ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, మే 9 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం పట్టణాన్ని మోడల్ మున్సిపాలిటీగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ప్రభుత్వవిప్, కడ పిఎసి చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ కాలనీలో నూతనంగా డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కుప్పంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు మౌలిక వసతులు అయిన తాగునీరు, డ్రైనేజీలు, వీధి దీపాలు, సిసి రోడ్లు కల్పించడం జరుగుతోందన్నారు. అర్హులకు ప్రభుత్వ పథకాల్లో లబ్ది కలిగిస్తున్నటుల చెప్పారు. కుప్పం పట్టణంలో 22కోట్లతో స్టేడియం నిర్మాణం, 5కోట్లతో స్మశాన వాటికలో ఎల్‌పిజి బర్నింగ్ యూనిట్, కుప్పం బస్టాండ్‌లోని జమీ ఒందారు పార్కు 10కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనులన్నీ త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. త్వరలోనే డికెపల్లి పార్కు అభివృద్ధి పనులు మొదలవుతాయన్నారు. ఇటీవలే 40కోట్లతో ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. కుప్పాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడం సిఎం చంద్రబాబు ఆశయమన్నారు. ప్రజలు కూడా అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కార్పోరేషన్ డైరెక్టర్ తిరుమగళ్, కౌన్సిలర్ వేలు,కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పు, నేతలు సత్యేంద్రశేఖర్, డికెపల్లి మణి, దేవా, రవి, ఎఎంసి డైరెక్టర్ ఇర్ఫాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 11 నుంచి అర్ధగిరిలో హనుమాన్ జయంతి వేడుకలు

తవణంపల్లి, మే 9 ప్రభాతవార్త :

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఈనెల 11 నుంచి 13 వరకు హనుమాన్ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ఏ. రఘుపతి, ఈవో ఇ. మునిశేఖర్ లు తెలిపారు. శనివారం దేవస్థానం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఆట వలె ఈ ఏడాది కూడా దేవస్థానంలో మూడు రోజులపాటు హనుమాన్ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఈనెల 11 నుండి 13 వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 11న అంకురార్పణతో ప్రారంభమయ్యే ఉత్సవాలు 13న ఉదయం జరిగే వసంతోత్సవంతో ఘనంగా ముగుస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజు ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు పూజలు, హోమాలు, బత్తుల కాల చేపల నిమిత్తం వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రతిరోజు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతుల కల్పనకు పలు కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని చైర్మన్ రఘుపతి, ఈవో మునిశేఖరులు తెలిపారు. దేవస్థానంలో జరిగే అనుమతి జయంతి వేడుకలకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసినట్లు వారు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని చైర్మన్ ఈఓలు పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో దేవస్థానం పాలక మండలి సభ్యులు శ్రీధర్, విభాకర్ శాస్త్రి, వినాయక, శోభ, రాధిక, ధనలక్ష్మి మ్మ, భాగ్యలక్ష్మి మ్మ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అర్ధ గిరి చైర్మన్ ఈవో పాలక మండలి సభ్యులు

## పలమనేరు బులెట్ ట్రైన్ పోరాటం

### కేంద్రం నుండి తొలి స్పందన



పలమనేరు, మే 9 ప్రభాతవార్త:

పలమనేరు పరిరక్షణ సమితి (పిపిఎస్) ఆధ్వర్యంలో చేపట్టిన బులెట్ ట్రైన్ పోరాటంపై కేంద్రం నుండి తొలి స్పందన వచ్చింది. పిపిఎస్ అందజేసిన వినతిపత్రం ప్రధాని కార్యాలయం పరిశీలనలో వున్నట్లు సమాచారం అందింది. దీంతో శనివారం స్థానిక ఎన్‌జిఓ భవనంలో పిపిఎస్ సభ్యులు సంబరాలు జరుపుకున్నారు. మైసూర్, బెంగళూరు నుండి చెన్నై వెళ్ళే బులెట్ ట్రైన్‌కు పలమనేరులో స్టాపింగ్ ఏర్పాటు చేయాలని గత నెలలో పిపిఎస్ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు, ఉద్యోగ వ్యాపార కార్మిక వర్గాలు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించిన విషయం తెల్సిందే. పట్టణ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ పిపిఎస్ ప్రధాన మంత్రి కార్యాలయానికి వినతిపత్రం పంపారు. దీనిపై స్పందించిన కేంద్ర ప్రభుత్వం రైల్వే బోర్డులోని ఎఫిషియన్సీ అండ్ రీసెర్చ్ విభాగానికి పంపడంతో అధికారుల పరిశీలనలో ఉన్నట్లు పిపిఎస్ అధ్యక్ష, కార్యదర్శులు టిఎల్ నరసింహులు, నారాయణ తెలిపారు. ఈ అంశంపై కేంద్రం ప్రక్రియ ప్రారంభం కావడం శుభ పరిణామమన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపిలు కూడా ఇందుకు సహకరించి ఈ ప్రాజెక్టు మంజూరయ్యేలా కృషి చేయాలని కోరారు. సభ్యులు విజయకుమార్‌రెడ్డి, పొన్ముడి, రామచంద్ర, శ్రీపురం సీతారామయ్య, విజయకుమార్, రెడ్డెప్పనాయుడు, వీరభద్రగౌడు, భాస్కర్, కృష్ణమూర్తి, శేఖర్, వెంకటేశ్వర్లు నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

## గంగజాతర దుకాణాలకు వేలం పాటలు



పలమనేరు, మే 9, ప్రభాతవార్త:

పలమనేరులో జరిగే గంగజాతర సందర్భంగా దుకాణాల ఏర్పాటుకు శనివారం వేలం పాటలు నిర్వహించారు. స్థానిక గంగమ్మగుడిలో ఎండోమెంట్ అధికారి సమక్షంలో ఈ వేలం పాటలు జరిగాయి. దేవస్థానం పాట రూ.1 లక్ష నుండి ప్రారంభం కాగా వేలం పాట దారులు రూ.2 లక్షల వరకు పాడారు. దీంతో అధిక మొత్తంలో వేలం పాడిన వ్యక్తికి అధికారులు ఖరారు చేశారు. శివాలయం నుండి గంగమ్మ గుడి వీధిలోనూ, గుడి ఎదురుగా గంగమ్మ తోపులో ఏర్పాటు చేసే దుకాణాల నుండి వేలం పాట దారులు ఈ మొత్తం పన్నులు రూపంలో వసూలు చేసేందుకు అనుమతించారు. వేలం పాటల రోజు నుండి ఈ నెల 14న అమ్మవారి శిరస్సు ఊరేగింపు, 15 న గంగజాతర, అమ్మవారి విశ్వరూప దర్శనం, 16న జలధి ఉత్సవం ఉంటుంది. దీంతో పాటు మరో 5 రోజుల పాటు దుకాణాలు ఉంటాయి. ఈ సందర్భంగా వివిధ రకాల దుకాణాలతో పాటు రంగుల రాట్నాలు, ఊయలలు వంటివి వినోద భరితంగా వుంటాయి.

## యువనాయకుడు హర్షచే పేదలకు అన్నదానం



కుప్పం, మే 9 ప్రభాతవార్త

టిడిపి యువనాయకుడు హర్ష ధర్మ తేజ శనివారం పేదలకు అన్న క్యాంటీన్‌లో ఉచితంగా అన్నదాన కార్యక్రమం నిర్వహ్నిచారు. తన పుట్టిన రోజు సందర్భంగా హర్ష ధర్మ తేజ కుటుంబ సభ్యులు అన్న క్యాంటీన్ ఛారిటబుల్ ట్రస్ట్‌కు 5,000రూపాయలని విరాళంగా అందజేశారు. తనపుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదానం చేయడం ఆనందం గా ఉన్నది అని హర్ష చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపీనాథ్ పాల్గొన్నారు. ఫోటో రైటప్ కెపిఎం 5

## మాదనపల్లిలో పోలీసులచే కార్డెన్ సెర్చ్



శాంతిపురం, మే 9 ప్రభాతవార్త

జిల్లా తుషార్ డూడీ, కుప్పం డిఎస్పీ పార్థసారథి ఆదేశాల మేరకు మండలంలోని మాదనపల్లి గ్రామంలో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సైలు నరేష్, వెంకటమోహన్, శ్రీకాంత్ సిబ్బందితో కలసి కార్డెన్ సెర్చ్ నిర్వహజంచారు. ఈసందర్భంగా సరైన డాక్యుమెంట్లు లేని నాలుగు టువీలర్లను సీజ్ చేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలన్నారు. అలాగే గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం, అక్రమ కార్యకలాపాలు జరిగితే సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు ధైర్యస్పర్శ, మహిళల భద్రత, సైబర్ నేరాలు, పోక్సో చట్టం తదితరాల గురించి అవగాహన కల్పించారు.

## మంత్రాలయానికి రాత్రిపూట బస్సు నడపాలి



పలమనేరు, మే 9, ప్రభాతవార్త:

పలమనేరు డిపో నుండి మంత్రాలయానికి అదనంగా రాత్రి పూట బస్సు నడపాలని పలువురు శనివారం డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం పలమనేరు నుండి ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు బస్సు బయలు దేరుతోంది. ఐతే ఈ బస్సు సాయంత్రం 5 గంటలకు మంత్రాయలం చేరుతుంది. దీని వల్ల గుడికి వెళ్ళే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం అప్పటికప్పుడు రాఘవేంద్రస్వామిని దర్శించుకొని తిరిగి మంత్రాలయం నుండి పలమనేరుకు రావాలంటే సమయం చాలడంలేదు. మరుసటి రోజు వరకు వేచి ఉండాల్సి వస్తోంది. అదనంగా రాత్రి 7 గంటలకు బస్సు పలమనేరులో బయలు దేరితే ఉదయం 6 గంటలకు మంత్రాలయం చేరుతుంది. ఉదయం నుండి స్వామి వారి దర్శనం మధ్యాహ్నం గుడిలో అన్నదానం పూర్తి చేసుకోవచ్చు. అలాగే రాత్రి 7 గంటలకు మంత్రాలయంలో బయలు దేరితే ఉదయం 6 గంటలకు పలమనేరు చేరుతుంది. దీనిపై డిఎం మాట్లాడుతూ ఈ విషయం ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం గైకొంటామని తెలిపారు.

### అంగన్‌వాడీ టీచర్లు..హెల్పర్లు

# అంకితభావంతో పనిచేయాలి

### - ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

### - కొత్తగా ఎంపికైన వారికి నియామకపత్రాలు !!



కుప్పం, మే 9 ప్రభాతవార్త

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు విధుల్లో అంకితభావంతో పనిచేయాలని ప్రభుత్వవిప్, కడ పిఎసి చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సూచించారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో నూతనంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లుగా ఎంపికైన 71మందికి నియామకపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల భవిష్యత్తుకు బంగారుబాట వేయాల్సిన బాధ్యత ఉందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంకు చర్యలు చేపట్టారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, బాలికలు, గర్భిణులు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం అందించి వారు ఆరోగ్యంగా ఎదిగేందుకు కృషి చేయాలని సూచించారు. విధులను బాధ్యతతో చేపట్టి మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, రాజగోపాల్, ఉదయ్‌కుమార్, వెంకటరమణ, సుబ్రమణ్యం, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు హైదర్ వలీ, శ్రీనివాసులు, కడ సభ్యురాలు సుగుణమ్మ, మాజీ సర్పంచ్ సంతోష్, సిడిపిఓలు చంద్రకళ, కల్పన పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం.

## టిపిఎల్ క్రికెట్ కప్ గెలుచుకున్న బైరెడ్డిపల్లి టీచర్స్



బైరెడ్డిపల్లి, మే 9 ప్రభాతవార్త

బైరెడ్డిపల్లి మండల ఉపాధ్యాయులు టీచర్స్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలలో విజయం సాధ్నిచారు. గత నెల రోజులుగా నిర్వహింపబడిన పలమనేరు, పుంగనూరు డివిజన్ పరిధిలో టీచర్ ప్రీమియర్ లీగ్ లెదర్ బాల్ టోర్నమెంట్ ఏతూరు గ్రౌండ్, కేపీల్ రాజలూరు గ్రౌండ్ నందు నిర్వహించడం జరిగింది. ఇందులో బైరెడ్డిపల్లి ఉపాధ్యాయ జట్టు ఫైనల్స్ నందు పుంగనూరు ఉపాధ్యాయ జట్టుపై గెలుపొంది, టీచర్ ప్రీమియర్ లీగ్ సీజన్ వన్ ట్రోఫీని అందుకోవడం జరిగింది. దీనిని పురస్కరించుకొని స్థానిక బైరెడ్డిపల్లి మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎం ఈ ఓ లు,జనార్దన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా విజేతలకు మెడల్స్, మెమొంటోలతో సత్కరిస్తూ, ట్రోఫీని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవోలు ప్రసంగిస్తూ బైరెడ్డిపల్లి మండల ఉపాధ్యాయులలో ఉన్నటువంటి క్రీడా నైపుణ్యాన్ని, క్రీడాస్ఫూర్తిని ప్రశంసించారు, ఉపాధ్యాయులు పనిచేస్తున్న తమ పాఠశాల విద్యార్థుల్లో కూడా దాగివున్న క్రీడా నైపుణ్యాలను, సృజనాత్మకతను వెలికి తీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డిపల్లి ఉపాధ్యాయ జట్టు కెప్టెన్ టైగర్ మోహన్, వైస్ కెప్టెన్ శశికుమార్, జట్టు సభ్యులు చిరంజీవి, షరీఫ్, మోహన్, తిరుమలేశ, సురేష్ బాబు,మధుబాబు, భాస్కర్, రఘురామ్, మల్లప్ప గారి మోహన్, రాజేష్, శివ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఫోటో రైటప్ బిపి 2

## బైరెడ్డిపల్లి మండల సర్వసభ్య సమావేశం



బైరెడ్డిపల్లి, మే 9 ప్రభాతవార్త

బైరెడ్డిపల్లి ఎంపీడీవో కార్యాలయం నందు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమానికి ఎంపీపీ మొగసాల రెడ్డప్ప, ఎంపీడీవో ఉపేంద్ర, జడ్పిటిసి కేశవులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ దామోదరాచారి, ఎం ఇ ఓ బాలకృష్ణ నాయక్ , మండల ఎంపీటీసీలు, సంబంధిత శాఖలకు చెందిన అధికారులు పాల్గొనడం జరిగినది. మండలంలో జరుగుతున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాలను గురించి చర్చించి ముసాయిదాను ఏర్పాటు చేయడం జరిగినది.ఇందులో భాగంగా జలారిపల్లిలో ఇన్నర్ డ్రైనేజీను ఏర్పాటు చేయాలని తీర్మానించారు.నీటి సరఫరా, పారిశుద్ధ కార్యక్రమాల గురించి ప్రాథమికంగా చర్చించడం జరిగినది. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు వారి కార్యక్రమాలను సభా ముఖంగా తెలియజేయడం జరిగినది. ముఖ్యంగా ఎంపీటీసీ సభ్యులు పదవ తరగతి ఫలితాలు తగ్గడంపై, మామిడికాయల కవర్ల డిమాండ్ పై, కరువు పనుల సమస్యలపై చర్చించడం జరిగినది.

## గంగజాతర ఊరేగింపులో అపశ్రుతి

### కూరగాయలు దుకాణాలు దగ్ధం

పలమనేరు, మే 9, ప్రభాతవార్త:

పలమనేరులో జరుగుతున్న గంగజాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం మేదర సంఘం నిర్వహించిన ఊరేగింపులో అగ్ని ప్రమాదం జరిగింది. ఎంబిటి రోడ్డు మీదుగా కేరళ డ్రమ్ములు, నయాండి డ్యాన్సులు, పిల్లన గ్రోవులు, బుట్టి బొమ్మలాటలతో ఊరేగింపు జరిపారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్పుల్లో నిప్పు రవ్వలు ఎగిసి పడి శివాలయం ఎదురుగా ఉన్న దినసరి కూరగాయల మార్కెట్‌లో రెండు దుకాణాలు అంటుకున్నాయి. దీంతో మంటలు చెలరేగి దుకాణాలు దగ్ధ మయ్యాయి. ఈ ప్రమాదంలో దాదాపు రూ.30 వేలు నష్టం సంభవించినట్లు దుకాణదారులు తెలిపారు. ఈ సంఘటనపై ఆలయ ఇఓకు ఫిర్యాదు చేశారు.

## 12 నుండి 21 వరకు హసన్‌పురం రైల్వే గేటు మూసివేత



పాకాల, మే 9,

ప్రభాతవార్త

పాకాల - చిత్తూరు రైల్వే మార్గంలోని హసన్‌పురం వద్ద గల రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు (ఎల్.సి నం.67)ను ఈనెల 12వ తేదీ నుండి 21వ తేదీ వరకు తా తా ్క లి క ం గా మూసివేస్తున్నట్లు రైల్వే ఇంజనీరింగ్ అధికారి మధుసూదన య్య ఒక ప్రకటనలో తెలి పారు. రైల్వే ట్రాక్ అత్యవసర మరమ్మత్తుల పనుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. మే 12వ తేదీ ఉదయం నుండి 21వ తేదీ సాయంత్రం వరకు గేటు మూసివేయబడుతుంది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు గమనించి ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని కోరారు. రైల్వే ట్రాక్ భద్రత, నిర్వహణ దృష్ట్యా చేపడుతున్న ఈ పనులకు వాహనదారులు, స్థానిక ప్రజలు సహకరించాలని రైల్వే అధికారులు విజ్ఞప్తి చేశారు.

## కూడళ్లలో హైమాస్ట్ ఎల్ఇడి లైట్లు ఏర్పాటు



కుప్పం, మే 9 ప్రభాతవార్త

స్థానిక అన్న క్యాంటీన్, గుడుపల్లె సర్కిల్ వద్ద నూతన హైమాస్ట్ ఎల్ఇడి లైట్లను ప్రభుత్వవిప్, కడ పిఎసి చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. అలాగే వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీరు అందించేందుకు చలివేంద్రంను సైతం ప్రారంభించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, కౌన్సిలర్లు సోమశేఖర్, జిమ్‌దాము, సురేష్, కార్పోరేషన్ డైరెక్టర్లు వేణుగోపాల్, తిరుమగళ్, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం, కో క్లస్టర్ శ్యాంసుందర్, కడ సభ్యుడు సతీష్, నేతలు ఆర్ఆర్ రవి, నాగభూషణం, లోకేష్, మల్లయ్యనాయుడు పాల్గొన్నారు.

## షాదీమహల్ మాజీ చైర్మన్ అన్సర్ మృతి

కుప్పం, మే 9 ప్రభాతవార్త



కుప్పం షాదీ మహల్ మాజీ చైర్మన్, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు హాజీ అన్సర్ బాషా శనివారం మృతి చెందారు. ఈయన గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. శనివారం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక కొత్తపేటలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

# ఏపీఎండిసి సంస్థ పరిరక్షణకు సంతకాల సేకరణ...



రైల్వేకోడూరు రూరల్, మే 9 ప్రభాతవార్త

రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండలం మంగంపేటలోని ఏపీఎండిసి బెరైటీస్ పరిరక్షణకు సిఐటియు మండల కార్యదర్శి జాన్ ప్రసాద్ ఆధ్వర్యంలో సిఐటియు రాష్ట్ర కమిటీ నాయకులు జి బాలసుబ్రమణ్యం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆర్ వెంకటేష్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఎండీసీ లో అవినీతి కారణంగా మైనింగ్ కొద్ది సంవత్సరాల లోనే అంతర్ధానం అయ్యే పరిస్థితి నెలకొని ఉందని గనులలో మిగిలిన మిగిలి ఉన్న 60 లక్షల టన్నుల వెరైటీస్ ను దశలవారీగా దేశీయ అవసరాల నిమిత్తం వినియోగించుకున్నట్లయితే మరో 20 ఏళ్ల పాటు మనుగడ ఉంటుందని ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని అన్నారు. ఏపిఎండిసి సంస్థను నమ్ముకుని 170 మంది మిల్లుల యజమానులు బెరైటీస్ ను పౌడర్ గా తయారుచేసి ఎగుమతి చేస్తున్నారని, ఈ పరిశ్రమను నమ్ముకుని పాతిక వేల మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారు. వీరి కారణంగా రైల్వే కోడూరు నియోజకవర్గం ఆర్థిక వ్యవస్థ నడుస్తుంది అన్నారు. వీరిని ఆధారం చేసుకుని పరోక్షంగా పలు కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. భూములు, ఇల్లు, స్థిర, చరస్తులును కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వకుండా అవుట్సోర్సింగ్ ట్రైనీ ఉద్యోగాలు ఇచ్చారని, పరిశ్రమ కొరకు త్యాగం చేసిన వీరికి ఉద్యోగాలు పర్మినెంట్ చేసి ఆదుకోవాలని అన్నారు. ఏకపక్షంగా కట్టబెట్టిన బల్క్ టెండర్ను రద్దు చేసి కొనుగోలుదారులందరికీ ఒకే రకమైన ధర నిర్ణయించాలని వారు కోరారు, అలాగే పౌడర్ ను మాత్రమే ఎక్స్పోర్ట్ చేసే విధంగా చర్యలు తీసుకొని ఈ ప్రాంత కార్మిక వర్గాన్ని ఆదుకోవాలని వారు కోరుతున్నారు. ఈ మేరకు ప్రజల వద్ద నుంచి సంతకాలు సేకరించి వాటిని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పి. మణి, సిఐటియు సీనియర్ నాయకులు యాదయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు లతీఫ్, వివోఏ కార్యదర్శి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## రైల్లో విలువైన ఇంటిపత్రాల సంచి చోరీ

తిరుపతి, మే 9 ప్రభాతవార్త:

సప్తగిరి ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తున్న సమయంలో విలువైన అసలైన ఇంటి పత్రాలు, రెవెన్యూ స్టాంప్ పేపర్లు ఉన్న బ్యాగ్ చోరీ జరిగింది, తిరుపతి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు, రేణిగుంటకు చెందిన ఎస్. కృష్ణయ్య తిరుపతి ఆర్‌పీఎఫ్ పోస్టులో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఈనెల 3వతేదీ తేదీ ఉదయం 10 గంటలకు సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లో రేణిగుంట నుండి తిరుపతికి ప్రయాణిస్తున్న సమయంలో ఒరిజినల్ ఇంటి పత్రాలు ఉన్న తన బ్యాగ్ కనిపించకుండా పోయిందని ఫిర్యాదులో తెలిపారు. ఆ సంచిలో ఒరిజినల్ ఇంటి పత్రాలు, వందరూపాలయు రెవెన్యూ స్టాంప్ పేపర్లు, లక్ష్మీ ౖ నివాసం ప్లాట్ నెం.63కు సంబంధించిన పత్రాలు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బ్యాగ్ కనిపించకపోవడంతో తిరుపతి రైల్వే పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తృటిలో తప్పిన ప్రమాదం




తిరుపతి, మే 9 ప్రభాతవార్త:

తిరుపతి సమీపంలో శనివారం తెల్లవారుజామున 35 మంది ప్రయాణికులతో బెంగళూరు నుంచి మచిలీపట్నం వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకుంది. అవిలాల చెరువు సమీపంలో జరుగుతున్న బ్రిడ్జ్ పనుల వద్ద రాంగ్ రూట్‌లో వచ్చిన లారీని డ్రైవర్ అప్రమత్తతతో పక్కకు తిప్పడంతో, అది రోడ్డు పనుల కోసం తవ్విన గుంతలోకి వెళ్లింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో భారీ ప్రాణనష్టం తప్పింది.

## పామి సర్దార్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్

తిరుపతి విద్య మే 9 ప్రభాత వార్త



సాహిత్య విభాగంలో ఔచిత్యసిద్ధాంతదృష్ట్యా ఉత్తర రామచరితస్య ఏకం అధ్యయనం అనే విశిష్ట అంశంపై పరిశోధన నిర్వహించిన రీసెర్చ్ విద్యార్థిని పామి సర్దార్ పీహెచ్‌డీ (డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ) అవార్డు అందుకున్నారు. ఈ పరిశోధనను సాహిత్య విభాగ అధ్యాపకురాలు డా. కె. లీనాచంద్ర మార్గదర్శకత్వంలో విజయవంతంగా పూర్తి చేశారు. భారతీయ సాహిత్యంలోని ఉత్తర రామచరితంపై ఔచిత్య సిద్ధాంత దృష్టితో చేసిన ఈ అధ్యయనం పరిశోధనాత్మకంగా, సాహిత్య పరంగా విశేష ప్రాధాన్యత సంతరించుకుందని అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. పరిశోధనలో పామి సర్దార్ చూపిన ప్రతిభ, విశ్లేషణాత్మక దృక్పథం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విశ్వవిద్యాలయం పరీక్షా నియంత్రకులు ప్రొఫెసర్ రమాకాంత మిశ్ర ఒక ప్రకటనలో వెల్లడించారు. పీహెచ్‌డీ సాధించడం పట్ల రీసెర్చ్ గైడ్ డా. కె. లీనాచంద్ర హర్షం వ్యక్తం చేస్తూ, పరిశోధన రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షి ంచారు. పీహెచ్‌డీ అవార్డు అందుకున్న పామి సర్దార్‌ను సాహిత్య విభాగ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విశ్వవిద్యాలయ విద్యార్థులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఫలితాల ఆలస్యంతో ఇబ్బందుల్లో పరిశోధక విద్యార్థులు

### ఆరు నెలలుగా విడుదల కాని ప్రీపీహెచ్‌డీ ఫలితాలు

తిరుపతి విద్య మే 9 ప్రభాత వార్త



శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రీపీహెచ్‌డీ ఫలితాల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్ కుమార్ విమర్శించారు. గత డిసెంబర్‌లో నిర్వహించిన పరీక్షలకు హాజరైన సుమారు 300 మంది పరిశోధక విద్యార్థులు ఆరు నెలలుగా ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తు కోసం కష్టపడి పరీక్షలు రాస్తే, అధికారులు మాత్రం ఫలితాల విడుదలలో నిరక్ష ్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇప్పుడు ఉన్న రెక్టార్ హయాంలో విద్యార్థి సమస్యలు పెరిగాయని, గతంలో కూడా ఫలితాల విడుదలలో తీవ్ర ఆలస్యం జరిగిందని గుర్తుచేశారు. వాల్యుయేషన్ పూర్తి కాకపోవడం పరిపాలనా వైఫల్యమేనని, దీని వల్ల పరిశోధక విద్యార్థుల కెరీర్, ఫెలోషిప్‌లు, తదుపరి అవకాశాలు ప్రభావితమవుతున్నాయని తెలిపారు. వెంటనే ఫలితాలు విడుదల చేయాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపడతామని ఎస్ఎఫ్ఐ హెచ్చరించింది.

## సత్యవేడు పరిసరాల్లో గంజాయి వినియోగాన్ని పూర్తిగా అరికడతాం : సీఐ



సత్యవేడు, మే 9 ప్రభాతవార్త:

సత్యవేడు ప్రాంతంలో గంజాయి వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు సత్యవేడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మురళీనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గంజాయి నియంత్రణ కోసం ప్రభుత్వం కొత్త టెస్టింగ్ కిట్‌ని ప్రవేశపెట్టిందని, ఈ కిట్ ద్వారా గత రెండు నెలల క్రితం గంజాయి సేవించినా గుర్తించవచ్చని తెలిపారు. ఈ కిట్ వినియోగంతో గంజాయి వినియోగాన్ని గుర్తించి అరికట్టడం సులభమవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే కొంత మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. సత్యవేడు చుట్టు పక్కల గ్రామాల్లో గంజాయి కలకలం గణనీయంగా తగ్గిందని, పూర్తిగా గంజాయి నిర్మూలన లక్ష్యంగా చర్యలు కొనసాగిస్తున్నామని సీఐ తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని గంజాయి, మద్యం, ఇతర మాధక ద్రవ్యాలను అరికట్టడం పోలీసుల బాధ్యతగా తీసుకున్నామని తెలిపారు. గంజాయి వాడడం, అమ్మడం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా ఆడ పిల్లలు ప్రత్యేకంగా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడపకుండా అపరిచతులతో పరిచయాలు పెంచుకోవద్దని హెచ్చరించారు. కొంత మంది దుండగులు మాధక ద్రవ్యాల మత్తులో ఆడ పిల్లల జీవితాలను నాశనం చేసే ఘటనలు జరుగుతున్నాయని, అలాంటి వ్యక్తుల నుంచి దూరంగా కోరారు. చదువుపై దృష్టి పెట్టండి..మీ భవిష్యత్‌ను కాపాడుకోండని విద్యార్థులకు స్నేహపూర్వకంగా సూచించారు. సమావేశంలో ఎస్ఐ సాయినాథ్ చౌదరి, ఎస్ఐ లావణ్య పాల్గొన్నారు.

## విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మినేట్ చేయాలి

నగరి, మే 9 ప్రభాతవార్త :




విద్యుత్ సిప్టు ఆపరేటర్‌గా పని చేయు కాంట్రాక్టు కార్మికులను పర్మినేట్ చేయాలని విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల అధ్యక్షులు మూర్తి తెలిపారు. శనివారం మండలంలోని నగరి సబ్‌డివిజనల్ విద్యుత్ కార్మికులు 3045 కార్మికుల సోషల్ మీడియా ఉద్యమం ద్వారా రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కి తమ సమస్యను పంపించినారు. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ 3045 కార్మికుల కుటుంబాల భవిషత్తు, ఉద్యోగ భద్రత, కెజియఫ్ తరహా మూడోవ పార్టీ విధానం రద్దు, పియఫ్ సర్వీస్ ఇన్సంటివ్ అమలు, సమాన పనికి సమాన వేతనం వంటి ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలని అన్నారు. ఇదే తరహాగా అదివారం చిత్తూరు డివిజన్‌లో సోషల్ మీడియా ఉద్యమం మరింత ఉత్సహంగా కొనసాగుతుందని తెలిపారు. ఈఉద్యమం జిల్లాలోని ప్రతి డివిజన్, సబ్ డివిజన్ నుండి కార్మికులు ఉద్యమంలో భాగస్వామ్యం అవుతారని తెలిపారు. ఈకార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వర్మ, నాయకులు జనార్దన్, ఏకాంబరం, బాల, రఘు, దేవరాజు, సుధాకర్, జయచంద్ర, ధర్మేష్, అయ్యప్ప, వెంటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అద్భుత ఫలితాలు : ఎమ్మెల్యే



పుత్తూరు రూరల్, మే 9 ప్రభాతవార్త:

నారా లోకేష్ గారి కృషి ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. శనివారం మండల ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన, 500 మార్కులు పైగా సాధించిన విద్యార్థులకు సన్మానం, ప్రభుత్వ బడి పిలుస్తోంది కార్యక్రమంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు, ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు అభినందలు, శుభాకాంక్షలు తెలిపి మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. నగరి ఎమ్మెల్యే, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్.కుమార్, పుత్తూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి మహేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారులు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎమార్సీలు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



తిరుపతి కలెక్టరేట్, మే 9 ప్రభాతవార్త :

రాస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి స్వర్గీయ డాక్టర్ గుత్తా.మునిరత్నం 5వ వర్ధంతి సందర్భంగా శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి వారి ద్వారా ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్ల కొరకు గుర్తించబడిన 97 మంది వృద్ధులకు విజయవంతముగా ఆపరేషన్లు చేయబడినది. వీరందరిని శనివారం నాడు రాస్ సేవా నిలయమునకు తీసుకురావడం జరిగినది. ఈ సందర్భంగా రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం మాట్లాడుతూ ఆపరేషన్ల తర్వాత వృద్ధులు తీసుకోవాల్సినటువంటి జాగ్రత్తలను వివరించి, తదుపరి జూన్ 5వ తేదీన తిరిగి కంటి పరీక్షలు చేసుకోవడానికి రాస్ సేవా నిలయం వద్దకు రావలసినదిగా కోరడమైనది. ఒకే రోజు ఇంతమందికి ఆపరేషన్లు చేయడానికి సహకరించిన సిబ్బందిని శ్రీ.వెంకటరత్నం అభినందిస్తూ శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదుపు సంఘాల ప్రాజెక్టు డైరెక్టర్ వి.నాగరాజు, కె నాగేశ్వర్ రాస్ ఫీల్డ్ అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నివారణ మహిళల చట్టపరమైన హక్కులు : డీఎస్పీ




పుత్తూరు రూరల్, మే 9 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణం, రూరల్‌లో గంజాయి వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పుత్తూరు డీఎస్పీ తెలిపారు. తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు పుత్తూరు డీఎస్పీ పర్యవేక్షనలో పుత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుత్తూరు సమీపం ఏడీకే కల్యాణ మండపంలో మహిళా భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి నియంత్రణ కోసం ప్రభుత్వం కొత్త టెస్టింగ్ కిట్‌ని ప్రవేశపెట్టిందని, ఈ కిట్ ద్వారా గత రెండు నెలల క్రితం గంజాయి సేవించినా గుర్తించవచ్చని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని గంజాయి, మద్యం, ఇతర మాధక ద్రవ్యాలను అరికట్టడం పోలీసుల బాధ్యతగా తీసుకున్నామని తెలిపారు. అదే విధంగా ఆడ పిల్లలు ప్రత్యేకంగా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడపకుండా అపరిచతులతో పరిచయాలు పెంచుకోవద్దని హెచ్చరించారు. కొంత మంది దుండగులు మాధక ద్రవ్యాల మత్తులో ఆడ పిల్లల జీవితాలను నాశనం చేసే ఘటనలు జరుగుతున్నాయని, అలాంటి వ్యక్తుల నుంచి దూరంగా ఉండాలని కోరారు. సైబర్ నేరాల నివారణ, మహిళల చట్టపరమైన హక్కులు, బాలల దుర్వినియోగం, బాల్య వివాహాల నివారణ గృహహింస, మహిళాభద్రత, ఆన్‌లైన్ గేమింగ్, మాధక ద్రవ్యాల నిరోధం, మాధక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ, సీఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## వేణు కళ్యాణ్‌చే వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

తిరుపతి హెల్త్, మే 9, ప్రభాతవార్త:



ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, బిజినెస్ కోచ్ వేణు కళ్యాణ్ శనివారం రష్ హాస్పిటల్ ఆవరణలో వ్యాపార నిర్వహణ, వ్యక్తిత్వ వికాసంపై అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పర్సనాలిటీ డెవలప్మెంట్, బిజినెస్ ఎలా ప్రారంభించాలి, బిజినెస్‌లో ఎలా రాణించాలి అనే అంశాలుపై హాస్పిటల్స్ సిబ్బందికి, ప్రజలకు అవ గాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రష్ హాస్పిటల్ అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, రష్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం

### పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన తల్లి

ఓబులవారిపల్లి మే 9 ప్రభాతవార్త

ఓబులవారిపల్లి మండలం చిన్నరాజుపూడి పంచాయతీకి చెందిన ఎద్దుల వారి పల్లి గ్రామ నివాసి అయిన ఎద్దుల కావేరి 20 సంవత్సరాలు ఇంటి నుంచి కనిపించకుండా పోయినట్లు ఆమె తల్లి విజయం తెలి వారిని ఓబులవారిపల్లి ఎస్సై మహేష్ తెలిపారు. వివరాలు ఇలా.. భర్త జీవనోపాధి కోసం కువైట్ కి వెళ్లడంతో ఇంటిలోనే ఉన్నదని, కూతురు కావేరి కూతురు మూడేళ్ల చిన్నారిని తీసుకొని ఎక్కడికో కనిపించకుండా వెళ్లిందని ఆమె తల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి గాలిస్తున్నామని ఆయన తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

## వాలీబాల్ టోర్నమెంట్‌కు రిజిస్ట్రేషన్‌కు నేడు ఆఖరు

### - ప్రోగ్రామ్ ఇన్చార్జ్ పిడి బందిల కుమార్

వరదయ్యపాలెం, మే 9, ప్రభాతవార్త

లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వాలీబాల్ టోర్నమెంట్ లో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్ కొరకు ఆదివారం ఆఖరు తేదీ అని ప్రోగ్రామ్ ఇన్చార్జ్ పిడి బందిల కుమార్ తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడానికి, ఈ ప్రాంత యువతను క్రీడలలో ప్రోత్సహించడానికి తొలినుంచి సహాయ సహకారాలు అందిస్తూ చొరవ చూపుతున్న లోకా ఫౌండేషన్ సామాజిక దృక్పథం అభినందనీయమని యువత హర్షం వ్యక్తం చేశారు. వరదయ్యపాలెం, బీఎన్ కండ్రిగ మండలాల్లో టోర్నమెంట్ పోటీల నిర్వహణకు చొరవ తీసుకోవాలని ఇటీవల యువత లోకా ఫౌండేషన్ వారికి విన్నవించారు. యువత వినతిపై సానుకూలంగా స్పందించిన లోకా ఫౌండేషన్ యాజమాన్య ప్రతినిధులు వరదయ్యపాలెం, బీఎన్ కండ్రిగ మండలాల్లో వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను నిర్వహించేందుకు అంగీకరించడంతో యువత లోకా ఫౌండేషన్ వారికి, ఆచార్య ఆనంద గిరిదాసాజీ, లోకేష్ దాసాజీ, సునీల్ దాసాజీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో అన్ని మండలాలలో క్రీడల టోర్నమెంట్ పోటీలను నిర్వహించేందుకు కృషి చేస్తామని లోకా ఫౌండేషన్ ప్రతినిధి సునీల్ దాసాజీ హామీ ఇవ్వడంతో యువత, వ్యాయామ ఉపాధ్యాయులు, వ్యాయామ దర్శకులు లోకా ఫౌండేషన్ యాజమాన్య ప్రతినిధులు సునీల్ దాసాజీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదల్చిన టీమ్‌లు మే నెల 10వ తేదీ ఆదివారంలోగా తమ తమ టీమ్ పేర్లను నమోదు చేసుకోవాలని టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు.

## టిడిపి నేత కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్ కంచర్ల



కుప్పం, మే 9 ప్రభాతవార్త.

కుప్పం షాది మహల్ మాజీ చైర్మన్, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు అన్సర్ భాష కుటుంబాన్ని శనివారం రాత్రి ప్రభుత్వ విప్ ,కడ పి ఎ సి చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పరామర్శించారు. అన్సర్ భాష మృతి చెందారన్న విషయం తెలుసుకొని స్థానిక కొత్తపేటకు చేరుకుని అన్సర్ భాష మృతదేహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పీకే ఎం యుడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు ,మాజీ సర్పంచ్ గోపీనాథ్ , షాది మహల్ చైర్మన్ సర్దార్ భాష ,క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కొత్తపేట ఇంచార్జ్ అప్పు , మతిన్ హాజరత్ తదితరులు పాల్గొన్నారు.

## లిడ్ క్యాప్ భూములపై కబ్జా యత్నం అడ్డుకట్ట

### జేసీబీతో చదును చేస్తుండగా అడ్డుకున్న కమిటీ నేతలు

తిరుపతి రూరల్, మే 9 ప్రభాతవార్త:

తిరుపతి రూరల్ మండలం దామినేడు ప్రాంతంలో లిడ్ క్యాప్ సంస్థ పేరుపై ఉన్న సుమారు ఆరు ఎకరాల భూమిని ఆక్రమించేందుకు శనివారం కబ్జాదారులు ప్రయత్నించారు. గిరిధర్, రామ్మూర్తి, గోవింద్ తదితరులు జేసీబీతో భూమిని చదును చేస్తుండగా సమాచారం అందుకున్న మాదిగ లిడ్ క్యాప్ భూముల పరిరక్షణ కమిటీ నేతలు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. సమాచారం మేరకు చేరుకున్న తిరుచానూరు పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకుని సంబంధితులను స్టేషన్‌కు తరలించారు. వారం రోజుల పాటు ఎవరూ భూమిలోకి ప్రవేశించరాదని సీఐ స్పష్టం చేశారు. కమిటీ చైర్మన్ పి.సుబ్బయ్య మాట్లాడుతూ దొంగ పట్టాలు సృష్టించి భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా ఇదే భూములపై పలు ఫిర్యాదులు ఇచ్చినప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. చర్మకారుల సంఘం నాయకులు ఈ



భూములు 197374లో చర్మకారుల అభివృద్ధి కోసం కేటాయించబడినవని పేర్కొన్నారు. ఇలాంటి భూములను ఆక్రమించడం తీవ్ర అన్యాయమని, బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. యువజన సంఘాల నేతలు మాట్లాడుతూ దొంగ డాక్యుమెంట్లతో భూకబ్జాలకు పాల్పడుతున్న వారిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా

# అపరిచిత వ్యక్తులపై నిఘా వుంచండి

**- ఇల్లు అద్దెకు ఇచ్చేటప్పుడు జాగ్రత్త వహించండి - కొత్తవారి వివరాలు, గుర్తింపు కార్డులు క్షుణ్ణంగా పరిశీలించాలి - సీఐ వెంకటేశ్వర్లు**



నాయుడుపేట, మే 9 ప్రభాతవార్త: పట్టణ ప్రజలు మరియు ఇళ్ల యజమానులు అపరిచిత వ్యక్తుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని టౌన్ సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ సరిహద్దుల నుంచి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు అక్రమ మార్గాల్లో మన ప్రాంతానికి వచ్చే అవకాశం ఉందన్న ముందస్తు సమాచారం మేరకు పోలీస్ యంత్రాంగం పూర్తిస్థాయిలో నిఘా పెంపొందించబడిందని ఆయన తెలిపారు.

**- పట్టణ ఇళ్ల యజమానులకు కీలక సూచనలు**

ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో ఇళ్లను అద్దెకు ఇచ్చే యజమానులు అపరిచితులకు ఇళ్లు ఇచ్చే ముందు వారి పూర్తి వివరాలను సేకరించాలని కోరారు. ముఖ్యంగా కొత్తగా వచ్చేవారి గుర్తింపు కార్డులను (ఐడీ ప్రూఫ్స్) తప్పనిసరిగా సరి చూసుకోవాలన్నారు. వారి పూర్వపరాలను, అడిగి వారు ఎక్కడి నుండి వచ్చారనే విషయాన్ని క్షుణ్ణంగా వివరించేంతవరకు కొంచెం దూరంగా ఉండి మాట్లాడాలి అని అన్నారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తులు, కొత్త ముఖాలు పట్టణంలో తారసపడితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని, అనుమానితుల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని ఆయన హెచ్చరించారు. పట్టణ భద్రత కోసం పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నారని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అపరిచిత వ్యక్తుల పట్ల సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఆయన భరోసా ఇచ్చారు. ఎక్కడి నుంచో వచ్చిన వారి పట్ల కాస్త దూరం పాటించి మాట్లాడడం అలాగే మీ ఆభరణాలను జాగ్రత్త చేసుకోవడం లాంటి సూచనలు పాటించాలని ముఖ్యంగా స్త్రీలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. అవకాశం ఉంటే ఇంటి ముందు ఒక్క సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం మంచిదని అన్నారు.

## రమేష్‌కు గంగా ప్రసాద్ పరామర్శ



సూళ్లూరుపేట, మే 9 ప్రభాతవార్త: సుళ్లూరుపేట ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్‌ను ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగా ప్రసాద్, గూడూరు శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్, తానంకి నానాజీ తదితరులు శనివారం ఆకుతోట రమేష్ స్వగృహానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆకుతోట రమేష్ అత్త సుశీలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీలో కీలక నేతగా వ్యవహరిస్తూ ఏఎంసి ఛైర్మన్‌గా పనిచేస్తున్న ఆకుతోట రమేష్‌ను ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. టిడిపి నేతలు ఎస్.విజయభాస్కర్ రెడ్డి, మేడా సాయి నారాయణ, అలీ భాయ్, వెంకీ యాదవ్, కొండలరావు, రమేష్ లాల్, సేట్ రాజా, వెంకటేశ్వర్లు,పామూరు మునిస్వామి, కె.మార్కండేయులు, దంతాల రవి తదితరులు పాల్గొన్నారు.

## బాలినేని కలసిన జనసేన నేతలు



సూళ్లూరుపేట, మే 9 ప్రభాతవార్త: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా జనసేన పార్టీ తిరుపతి వేదికగా రాజకీయ వ్యూహరచన మొదలుపెట్టింది. శనివారం తిరుపతిలోని ఉదయ్ ఇంటర్నేషనల్ హోటల్‌లో మాజీ మంత్రి, జనసేన నాయకులు బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పార్టీ అత్యంత కీలక సమావేశం నిర్వహించారు. ముందుగా, స్థానిక సంస్థల డీలిమిటేషన్ (పునర్విభజన) అనే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన నాయకులు షేక్ మాభాషా, చేని సూరి తదితరులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. అనంతరం జరిగిన పార్టీ సమావేశంలో పలువురు జనసేన నేతలు మాట్లాడుతూ, ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఇప్పటి నుండే ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను వివరించాలని దిశానిర్దేశం చేశారు. ఈ భేటీలో స్థానిక ఎన్నికల్లో పోటీ చేయబోయే ఆశావహులు, జనసైనికు లుపార్టీ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారు



వెంకటగిరి, మే 9 ప్రభాతవార్త: పట్టణ నడిబొడ్డున కోట్లాది రూపా యల విలువైన ప్రభుత్వ స్థలాలకు తప్పుడు రికార్డులు సృష్టించి కబ్జా చేసేందుకు ల్యాండ్ మాఫియా ప్రయత్నిస్తోందని ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కమిటీ సభ్యులు, సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వి.వి రమణయ్య తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పరిరక్షణ కమిటీ వారు నిరసన తెలిపారు. వీరిని అడ్డుకొని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ఇప్పటికే స్థానిక తహసిల్దార్‌కి, శ్రీకాళహస్తి ఆర్డిఓకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా ఫలితం లేకపోవడంతో పట్టణంలోని రాజకీయపక్షాలు, పౌర సేవా సంస్థలు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కమిటీగా ఏర్పడి ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే త్రిభువని సెంటర్లో ఉన్న 45 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని చేజిక్కించుకున్నారు. తాజాగా తాలూకా సమితి కోసం 1965లో సేకరించిన ఎ.661 సెంట్ల భూమిని కాజేయడానికి సిద్ధపడ్డారు. అప్పటి రెవిన్యూ అధికారులు ప్రభుత్వం సేకరించిన తర్వాత ఫేరడంగుల్లో ఇంప్లిమెంట్ చేయకపోవడం వల్ల అవే పేర్లు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఫేరడంగుల్లో ఉన్న షేక్ అబ్దుల్ కరీం సాహెబ్, దంపెల్ల వెంకటసుబ్బయ్య పేర్లను వాడుకుని వారికి వారసులుగా ఎవరినో చూపించి ఫేక్ రికార్డు సృష్టించారు. నిజానికి ఈ స్థలంలో ఉన్న భవనాల్లో 1968 నుంచి 2015 వరకు విశ్వోదయ కళాశాల తరగతులు, అనుబంధ హాస్టల్ కూడా నడిచాయి. ఇటీవలే భవనాలు శిథిలావస్థకు చేరడంతో వాటిని తొలగించారు.ప్రభుత్వ కళాశాల అనుభవంలో ఉన్న ఈ ఖాళీ స్థలంలో నివాస గృహాలు ఉన్నట్లు గత తహసిల్దార్ అనుభవం కూడా ల్యాండ్ మాఫియాకి రాసిచ్చారు. ఈ తప్పుడు డాక్యుమెంట్ల ఆధారంగా హైకోర్టులో నుంచి ఒక డైరెక్షన్ తెచ్చుకుని రెవెన్యూ అధికారులను లోబరుచుకుని ఈ భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.కె. ప్రసాద్, జనసేన నాయకులు తోట కృష్ణయ్య, వైసీపీ నాయకులు చిట్టేటి హరికృష్ణ, విశ్వోదయ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి అల్లం రాజా, సిపిఐ నాయకులు ఎస్.నరసింహులు, రైతు కూలీ సంఘం నాయకులు గంగలపూడి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది: ఎమ్మెల్యే

వాకాడు మండలం కల్లూరు కొత్తపాలెం గ్రామంలోని సాక్షాత్తు శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణం చేపట్టిన అనంతరం ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారి అభివృద్ధి చెందుతుందని డాక్టర్ పాశం సునీల్ కుమార్ అన్నారు. ఈ ప్రాంత ప్రధాన టిడిపి నాయకుడు దువ్వూరు జనార్దన్ రెడ్డికి తాను పార్టీ అండగా ఉంటుందని, ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతు పూర్తిస్థాయిలో భరోసాగా ఉంటానన్నారు. ఈ ప్రాంతంలో నివసించే ప్రజలు, రైతులు రానున్న రోజుల్లో అభివృద్ధి చెందుతారన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## మాజీ సీఎం జనార్దన్ రెడ్డి సేవలు మరువలేనివి



వెంకటగిరి, మే 9 ప్రభాతవార్త: దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుపల్లి జనార్దన్ రెడ్డి సేవలు మరువ లేమని వైసిపి రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 12వ వర్ధంతి సందర్భంగా వెంకటగిరిలో ఘనంగా నివాళి కార్యక్రమాలు నిర్వహించారు. నేదురుమల్లి నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అభిమానులు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని పార్లమెంట్, రాజ్యసభ, శాసనసభ, శాసన మండలి వంటి కీలక చట్టసభల్లో సేవలందించిన ఘనత నేదురుమల్లి జనార్దన్ రెడ్డికే దక్కుతుందన్నారు. వెంకటగిరి అభివృద్ధిలో నేదురుమల్లి తనదైన ముద్ర వేశారని, తొమ్మిదవ బెటాలియన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ, నిమ్మచెని పరిశోధనా కేంద్రం, వెంకటగిరిని మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడం, ఏపీఆర్జేసీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలను ఏర్పాటు చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో రెవెన్యూ మంత్రిగా పనిచేసిన కాలంలో రైతుల ప్రయోజనార్థం పట్టాదార్ పాస్ పుస్తకాలను ప్రవేశపెట్టిన ఘనత కూడా నేదురుమల్లిదేనని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు నాగయ్య, దశరథ రామిరెడ్డి, మురళీకృష్ణ, నరసింహారావు, ధనియాలు రాధా, ఆదిశంకరయ్య, సుబ్బారావు కార్యకర్తలు, నేదురుమల్లి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కుంభాభిషేక మహోత్సవంలో ఎమ్మెల్యే



వాకాడు, మే 9 ప్రభాతవార్త: వాకాడు మండలం కల్లూరు కొత్తపాలెం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవాలు గత రెండు రోజులుగా జరుగుతున్న సందర్భంగా ఆలయ నిర్వాహకుడు, టిడిపి నాయకుడు దువ్వూరు జనార్దన్ రెడ్డి కోరిక మేరకు శనివారం జరిగే చివరి రోజు గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్‌ను ఆహ్వానించగా, ఎమ్మెల్యే ప్రత్యేక ఆహ్వానం మేరకు శనివారం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలోకి ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ రాకతో దువ్వూరు జనార్దన్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాలకు విశిష్ట ముఖ్యఅతిథిగా హాజరైన గూడూరు శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్‌కు శాలువా కప్పి గజమాలతో సత్కరించారు. ఆలయంలో పండితుల మంత్రోచ్చారణలతో పూర్ణ కుంకుమతో ఎమ్మెల్యేకి జనార్దన్‌రెడ్డి అందించారు. ఆలయంలోని వచ్చినటువంటి భక్తులను, నాయకులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా పలకరించారు. ఈ ఆలయ నిర్మాణానికి దృఢ సంకల్పంతో కార్య దీక్షతో చేపట్టిన తక్కువ సమయంలోనే శ్రీ వెంకటేశ్వర స్వామి గుడిని నిర్మాణం చేపట్టడం, తిరుమలలో ఉన్నటువంటి సాక్షాత్ వెంకటేశ్వర స్వామి విగ్రహ రూపమును ఈ ప్రాంతంలో ప్రతిష్ట చేయించిన దువ్వూరు జనార్ రెడ్డిని ఎమ్మెల్యే హృదయపూర్వకంగా పట్టుకొని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం గుడిలో ఎమ్మెల్యేకి తీర్థప్రసాదాలు పూజారి అందించారు. కోట వాకాడు చిట్టమూరు మండలాల నుండి వచ్చినటువంటి కన్వీనర్లు, పార్టీ సీనియర్ నాయకులతో కొంతసేపు ఆ ప్రాంగణంలో మాట్లాడారు.

## హోమియో మందులు పంపిణీ



వాకాడు, మే 9 ప్రభాతవార్త : ప్రస్తుత వేసవి కాలంలో ఈ ప్రాంత వాసులకు సీజనల్ వ్యాధులు శోకకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా హోమియో మందులను శనివారం ఎం.వి.రావు ఫౌండేషన్ నిర్వాహకులు పంపిణీ చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి సమీపంలో ఉన్న సారనాథ్ పట్టణంలో మ్యూజియం వద్ద ఆ ప్రాంత వాసులకు సీజనల్ వ్యాధుల గురించి వివరించి వారికి అవగాహన కల్పించి అనంతరం ముందస్తు చర్యలకు గాను హోమియో మందులను వారికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవి రావు ఫౌండేషన్ 18వ వార్షికోత్సవాన్ని పరిష్కరించుకొని ఎంవీ రావు ఫౌండేషన్ ఛైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి సారనాథ్ ప్రాంత ప్రజలకు హోమియో మందులను అందించారు.

## జలసంరక్షణతో అన్నదాతకు...ఆనందం

**-గంగల పూడి చెరువు పునరుద్దరణ**



శ్రీకాళహస్తి రూరల్,మే 9 ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన జలసంరక్షణతో అన్నదాతకు ఆనందం కల్గుతుంది. ఉపాధి హామీ పథకంలో పని చేసే వేతన దారులకు వరంగా మారింది. పురాతన కాలం నుంచి నిర్లక్ష్యానికి గురౌతున్న చెరువులకు మహర్దశ కల్పించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యవసాయానికి బాసటగా ఉంది. ఈ నేపథ్యంలో జలసంరక్షణ కార్యక్రమాలతో చెరువులు కేవలం నీటి వనరులే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మానవ మనుగడకు,సంస్కృతి పరిరక్షణకు పట్టుకొమ్మలుగా నీటి నిల్వలకు మాత్రమే కాకుండా వరదల ప్రభావం తగ్గించటానికి పర్యావరణ సమతౌల్యానికి భూగర్భజలాల సంరక్షణకు అత్యంత కీలకమైనవి. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి మండలం గంగల పూడి చెరువు పునర్దురణ కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. దా ంతో ఈ చెరువు పునరుద్దరణతో 150 ఎకరాలకు నీరు ఆధారం కానున్నది. కూటమి ప్రభుత్వం చేపట్టిన జలసంరక్షణ పథకం శ్రీకాళహస్తి మండలానికి వరంగా మారింది. జలధార-జలహారతి కార్యక్రమం ఓ వరంగా మారింది. ఈ కార్యక్రమాల్లో 85 పనులు చేపట్టేందుకు పరిపాలనా అనుమతులు ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది. ఇందులో 77 పంట కాలువలు, 8 నీటి సంరక్షణ కుంటల పనులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి మండలంలోని గంగలపూడి చెరువులో 30 మీటర్ల పొడవు,30మీటర్ల వెడల్పు,ఒక మీటర్ లోతుతో రూ.4లక్షల అంచనా వ్యయంతో నీటి సంరక్షణ కుంటపనిని 75 మంది ఉపాధిహామీ వేతనదారులతో 15రోజులుగా ఉపాధి పనులు అవకాశం వచ్చింది. వర్షాల వల్ల కురిసేనీరుపల్లాం చెరువు నిండి పంట కాలువల ద్వారా గంగల పూడి చెరువుకు చేరుతుంది. ఈ చెరువు నిండటం వల్ల 15 బావులు, 4 బావులు రీచార్జ్ అవుతాయని రైతులు తెలిపారు. దీ ంతో గంగలపూడి, వేలవేడు గ్రామాలకు లబ్ది చేకూరుతుంది.ఈ నీటి ద్వారా సుమారు 150 ఎకరాలకు పైగా సాగునిరందుతుంది.ఈ నీటి ద్వారా వరి,వేరుశెనగ పంటలను రైతు పండించుకుంటారు.జలహారతికి సంబందించి ఓ లబ్దిదారుడు మాట్లాడుతూ గతంలో వంద రోజుల ఉన్న పని దినాలను కొత్త పథకం ద్వారా 125 రోజులకు పెరిగిందన్నారు. నేడు ఈ పనుల వల్ల రోజూ రూ.300 నుంచి 307లు వస్తుందని సంతృప్తి వ్యక్తం చేసారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పని తీరుతో రైతులు ఎంతో సంతృప్తి కరంగా ఉన్నారు.

## ఘనంగా నేదురుమల్లి 12వ వర్ధంతి



వాకాడు, మే 9 ప్రభాతవార్త : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, రాజ్యసభ సభ్యులు దివంగత డాక్టర్ నేదురుమల్లి జనార్దన్ రెడ్డి 12వ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. నేదురుమల్లి జనార్దన్ రెడ్డి చిత్రపటానికి వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జి మేజర్ మల్లి రామ్ కుమార్ రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అశోక పిల్లర్ సెంటర్ సమీపంలో జనార్దన్ రెడ్డి విగ్రహానికి రామ్ కుమార్ రెడ్డి అనుచరులతో వెళ్లి విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి ఆశయాలు సాధనంగా పనిచేస్తున్నారన్నారు. ఆయన లేని లోటు, తీరనిలోటని ఆయన దుర్భాంతికి లోనయ్యారు. పలువురు నాయకులు ఆయన ఆయన వద్దకు వెళ్లారు. ఈ ఘన వర్ధంతి వేడుకలలో కొడవలూరు దామోదర్ రెడ్డి, పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి, కోట వాకాడు చిట్టమూరు బాలయపల్లి, సైదాపురం తదితర మండలం నుండి పలువురు నాయకులు రాంకుమార్ రెడ్డిని కలిసి వెళ్లారు.

## వైభవంగా ప్రసన్న వేంకటేశ్వరునికి కల్యాణం



వడమాలపేట, మే 9 ప్రభాతవార్త: అప్పలాయగుంటలో అభయ హస్తంతో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి శనివారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం అయిన శ్రవణం రోజున ప్రతి నెల స్వామివారికి కల్యాణం జరిపించడం ఆనవాయితీ. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 11 గంటలకు స్వామివారితో పాటు ఉభయదేవేరుల ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. అర్చకులు తిప్పాయాచార్యులు అగ్నిహోమం, వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా టీటీడీ లాంఛనాలతో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ శ్రీవారు శ్రీదేవి భూదేవి మెడలో మంగళ సూత్రధారణ చేశారు. కల్యాణోత్సవం టికెట్లు తీసుకున్న దంపతులు ఈ వేడుకను తనివితీరా తిలకించి పులకించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.సాయంత్రం తిరుచ్చి వాహనంపై అధిరోహించి మాడా వీధుల్లో విహరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి వేణుగోపాల్, ఏఈవో దేవరాజులు, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, రమణాచార్యులు, వేద పండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడికి చలో...చలో...

# వైభవంగా బడి పిలుస్తోంది



రైల్వేకోడూరు రూరల్, మే 9ప్రభాతవార్త: రైల్వే కోడూరు పట్టణంలో శుక్రవారం చిట్వేల్ రోడ్‌లో ఉన్న ప్రభుత్వ బాలికొన్నత పాఠశాల నందు బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా డీఈవో కెవిఎన్ కుమార్, ఇందిరా దేవి, రైల్వే కోడూరు సిఐ చంద్రశేఖర్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మన సంకల్పం విద్యా ప్రగతి ప్రభుత్వ బడికి చలో చలో అన్నా నినాదంతో ముందుకు సాగాలని డీఈఓ కె వి ఎన్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ప్రభుత్వ బడులు కీలకమని అన్నారు. 202627 విద్యా సంవత్సరానికి విద్యార్థుల నమోదు పెంపుదల లక్ష్యంగా చేపట్టిన ఈ భారీ ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమానికి అందరూ సహకరించాలని తెలిపారు. అదేవిధంగా వివిధ గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ తల్లిదండ్రులతో ప్రత్యక్షంగా మాట్లాడి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల లోనే చదివించాలని కోరారు. కోడూరు సిఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, మూడు జతల యూనిఫామ్, బూట్లు, షాక్స్ లు, మధ్యాహ్న భోజనం తదితర వంటివి అందజేయడం డిజిటల్ బోధన, శుభ్రమైన తరగతి గదులు, త్రాగునీరు మరుగుదొడ్లు వంటి సమగ్ర సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలలో ఉందని వీటి ద్వారా విద్యార్థులకు ఎంతో మేధోసంపతి మంచి ఫలితాలకు ఈ పాఠశాలలో ఎంతో ఉపయోగపడతాయని విద్యార్థుల తల్లిదండ్రులు దీనిపై అవగాహన కలిగి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని సిఐ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ జి సురేష్, ఉప విద్యాశాఖ అధికారి ఇందిరా దేవి, జిల్లా ఐటీ సెల్ ధనుంజయ నాయుడు, మండల విద్యాశాఖ అధికార్లు సురేష్, సుందర్ బాబులు, ప్రధాన ఉపాధ్యాయులు రామయ్య, అశోక్, గుంజుపల్లి కిరణ్‌తో పాటు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఫోటో: డోనర్

## రెండోఘాట్‌లో బస్సుల తనిఖీకి... అధునాతన ఏర్పాట్లు

**-టోల్‌గేట్ దాటాక ప్రత్యేక "బస్‌బే"**




ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల: తిరుమలకు వస్తున్న లక్షలాదిమంది యాత్రికులు తమ వాహనాలను,లగేజీలను అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రంలో తనిఖీ చేసుకోవడం జరుగుతుంది. ఇదే సమయంలో సామాన్యభక్తులు కూడా పలు రకాలుగా తిరుపతికి చేరుకుని తిరుమలకు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. ఇలా ప్రయాణించే వారిని ఇకపై సప్తగిరి తనిఖీ కేంద్రం వద్ద దిగి తనిఖీ చేసుకోవాల్సిన అవసరం లేదు. ఆర్టీసి బస్సులన్నీ టోల్‌గేట్ దాటిన తరువాత వచ్చే వరసిద్ధివినాయక స్వామి ఆలయం సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేస్తున్న బస్‌బేలో చేరుకుని తనిఖీ చేసుకోవాల్సి రానుంది. ఇప్పటికే ప్రతిరోజూ 450 వరకు ఆర్టీసి బస్సులు తిరుమల- తిరుపతి, తిరుపతి-తిరుమల మధ్య నడుస్తున్నాయి. 40వేలమంది వరకు యాత్రికులు ప్రయాణిస్తున్నారు. అలిపిరి తనిఖీకేంద్రంలో వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఇక్కడ బస్సులు దిగిన ప్రయాణీకులు/భక్తులు తిరిగి అదే బస్సులను ఎక్కడంలో అవస్థలు పడుతున్నారు. కొన్ని సమయాల్లో బస్సులు తప్పిపోతున్నారు. దీంతో ఈ తనిఖీలను మరింత సాఫీగా సులభంగా వినాయకస్వామి గుడివద్ద చేపట్టేందుకు బుధవారం టిటిడి బోర్డు కూడా ఆమోదించింది. అలిపిరి టోల్‌గేట్‌లో వేకువ జామున 3గంటల నుండి అర్ధరాత్రి 12గంటల వరకు వాహనాలను అనుమతిస్తున్నారు. దేశం నలుమూలల నుండి వస్తున్న యాత్రికులతో పాటు 10వేలకు పైగా వాహనాలు, 450వరకు ఆర్టీసి బస్సులు, రెండువేల వరకు స్థానిక వాహనాలు,ట్యాక్సీలు, మరో వెయ్యివరకు ద్విచక్రవాహనాలు ఇలా పెద్దసంఖ్యలో అలిపిరి టోల్‌గేట్ దాటుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. బస్సులను ఇకపై వినాయకగుడి వద్ద బస్‌బేలో తనిఖీలు చేయాలని నిర్ణయించడం విశేషం. 12లేన్లను 15లేన్లుగా విస్తరించడానికి చర్యలు చేపడుతున్నారు.

## చెల్లెలు గంగమ్మకు అన్న వెంకన్న సారే

**-చిందులేసిన ఉద్యోగులు**



తిరుమల,మే9ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతి నగర గ్రామదేవతగా విరాజిల్లుతున్న తాతయ్య గుంట గంగమ్మకు అన్న శ్రీవారి తరపున సారెను శనివారం సాయంత్రం సమర్పించారు. సంప్రదాయబద్ధంగా మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కళాబృందాల ప్రదర్శనల నడుమ ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. టిటిడి తిరుమల పోటు ఏఈఓ గుండ్లూరు మునిరత్నం గోవిందరాజస్వామి ఆలయం వద్ద నుండి శ్రీవారి సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్‌కు అందజేశారు. ప్రతి ఏడాది శ్రీవారి ఆలయం నుండి గంగమ్మ తల్లికి సారె సమర్పించడం సంప్రదాయంగా కొనసాగుతోంది. శోభాయాత్రగా గంగమ్మ ఆలయానికి సారెను తీసుకెళ్లి ఆలయ అర్చకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు, టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మీ మ్మ, జానకీ దేవి, గోవిందరాజస్వామి ఆలయం ఏఈఓ ఏబీ నారాయణ చౌదరి, బొక్కసం ఇంఛార్జి గురురాజ స్వామి, సూపరింటెండెంట్ శేషగిరి, పలువురు భక్తులు, టిడిపి నాయకులు ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

## తాతయ్యగుంట గంగమ్మకు జాతర విరాళాలు



తిరుపతి, మే 9ప్రభాతవార్త: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా శనివారం ఉదయం బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర ఏర్పాట్ల కోసం గంగమ్మ గుడి ఛైర్మన్ నైనార్ మహేష్ యాదవ్‌కి 25వేల రూపాయలు విరాళాన్ని గిరిధర్ అందజేశారు. అలాగే జైపూరి గ్రూప్స్ ప్రతినిధి అవినాష్ గంగమ్మ ఆలయానికి ఐదులక్షల రూపాయలు విరాళమిచ్చారు. తాతయ్య గుంట గంగమ్మ దేవస్థానం జాతర నిర్వహణ ఖర్చుకు ఈ విరాళాన్ని శాప్ ఛైర్మన్ రవి నాయుడు ద్వారా ఆలయ ఛైర్మన్ నైనార్ మహేష్ యాదవ్,ఈఓ జయకుమార్‌కు అందజేశారు

# ప్రైవేట్ పాఠశాలల్లో గురువుల వెతలకు అంతమేది?

## అడ్మిషన్ల వేటలో బందీలుగా ఉపాధ్యాయులు!




తిరుపతి విద్య, మే 9 ప్రభాతవార్త

నేటి కార్పొరేట్ విద్యా ప్రపంచంలో ఉపాధ్యాయుల విలువ బోధనలో కాకుండా, వారు తీసుకువచ్చే అడ్మిషన్ల సంఖ్యపై ఆధారపడి ఉంటోంది. పాఠశాల యాజమాన్యాలు ఉపాధ్యాయులకు నిర్దిష్టమైన టార్గెట్లను విధిస్తూ, వారిని మార్కెటింగ్ ఏజెంట్లుగా మారుస్తున్నాయి. విద్యా సంవత్సరం ముగియకముందే టీచర్లు వీధుల వెంట తిరిగి విద్యార్థులను చేర్పించాలని హుకుం జారీ చేస్తున్నాయి. బోధనపై దృష్టి పెట్టాల్సిన మేధావులు నేడు స్కూల్ కరపత్రాలు పట్టుకుని ఇంటింటికీ తిరుగుతున్నారు. ఈ ఒత్తిడి కారణంగా ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారు. ఒక పవిత్రమైన వృత్తిని కేవలం లాభాపేక్ష కలిగిన వ్యాపారంగా మార్చడం విద్యా వ్యవస్థకే తీరని నష్టం కలిగిస్తోంది. దీనిపై జిల్లా యంత్రాంగం నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### విశ్రాంతి లేని వేసవి సెలవులు

వేసవి సెలవులు అంటే ఉపాధ్యాయులకు కాస్త విశ్రాంతి దొరికే సమయం, కానీ ప్రైవేట్ స్కూళ్లలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. ఎండలు 45 డిగ్రీలు దాటుతున్నా సరే, టీచర్లు మధ్యాహ్న సమయాల్లో కూడా ఊరూరా తిరగాలని యాజమాన్యాలు ఆదేశిస్తున్నాయి. కనీసం తాగునీరు, ప్రయాణ ఖర్చులు కూడా ఇవ్వకుండా వారిని రోడ్లపైకి పంపిస్తున్నారు. సెలవుల్లో కుటుంబంతో గడపాల్సిన సమయాన్ని స్కూల్ ప్రచార కార్యక్రమాలకు ధారబోయాల్సి వస్తోంది. ఆరోగ్యం దెబ్బతిన్నా సరే, టార్గెట్ పూర్తి చేయలేదనే నెపంతో సెలవు ఇచ్చే ప్రసక్తే లేదని యజమానులు తెగేసి చెబుతున్నారు. ఈ ఎండ దెబ్బకు టీచర్లు అస్వస్థతకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇది మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని విద్యావేత్తలు మండిపడుతున్నారు.

### జీతాల కోత మరియు తొలగింపు బెదిరింపులు

ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఉద్యోగం ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని దౌర్భాగ్య స్థితి నెలకొంది. "అడ్మిషన్లు రాకపోతే వచ్చే జూన్ నుండి మీరు స్కూల్‌కు రావాల్సిన అవసరం లేదు" అని నిర్మొహమాటంగా బెదిరిస్తున్నారు. టార్గెట్ పూర్తి చేయని వారి మే నెల జీతాలను ఆపివేస్తూ యజమానులు వేధింపులకు పాల్పడుతున్నారు. మరికొన్ని చోట్ల సగం జీతం మాత్రమే ఇచ్చి, మిగిలినది అడ్మిషన్లు చేస్తేనే ఇస్తామని షరతులు పెడుతున్నారు. తమ కుటుంబాలను పోషించుకోవడానికి వేరే దారి లేక, ఉపాధ్యాయులు ఈ అవమానాలను భరిస్తూ మౌనంగా ఉంటున్నారు. విద్యాశాఖ నియమ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ జీతాల కోతలపై తక్షణమే విచారణ జరపాలి.

### ఆత్మగౌరవాన్ని కాలరాస్తున్న యాజమాన్యాలు

కొన్ని విద్యాసంస్థలు ఉపాధ్యాయులను కూలీల కంటే హీనంగా చూస్తూ, వారితో బోధనేతర పనులు చేయిస్తున్నాయి. స్కూల్ భవనాలకు పెయింటింగ్ వేయించడం, తరగతి గదులు ఊడ్చడం వంటి పనులను కూడా టీచర్లకే అప్పగిస్తున్నారు. గోడలపై బొమ్మలు గీయించడం, స్కూల్ బస్సులను శుభ్రం చేయించడం వంటి పనులు చేయిస్తూ వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు. పుస్తకాల బరువును మోయడం, యూనిఫాంల పంపిణీ వంటి పనుల్లో కూడా టీచర్లనే వాడుకుంటున్నారు. విద్యార్థుల ముందు గౌరవంగా నిలబడాల్సిన గురువులు, ఇలాంటి పనులు చేయడం చూసి సమాజం ఆశ్చర్యపోతోంది. వృత్తిపరమైన గౌరవం లేని చోట విద్యార్థులకు క్రమశిక్షణ ఎలా అందుతుందో అధికారులు ఆలోచించాలి.

### అధికారుల నిమ్మకు నీరెత్తిన వైఖరి: కదిలితేనే మారుతుందీ వ్యవస్థ

జిల్లాలో ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు (డి ఈ ఓ ) మరియు జిల్లా కలెక్టర్ మౌనంగా ఉండటం విచారకరం. ప్రైవేట్ స్కూళ్లలో జరుగుతున్న అక్రమాలపై ఎటువంటి తనిఖీలు లేకపోవడం యాజమాన్యాలకు వరంగా మారింది. గుర్తింపు పొందే సమయంలో ఒక నిబంధన, నడిపేటప్పుడు మరో నిబంధన పాటిస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయుల నుండి రహస్యంగా ఫిర్యాదులు స్వీకరించే వ్యవస్థను అధికారులు ఏర్పాటు చేయాలి. కేవలం అడ్మిషన్ల కోసమే టీచర్లను వేధిస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని బాధితులు కోరుతున్నారు. జిల్లా యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తేనే ఈ ఖిలఅడ్మిషన్ల మాఫియాఖికు అడ్డుకట్ట పడుతుంది. లేనిపక్షంలో భవిష్యత్తు తరాలకు విద్యను అందించే ఉపాధ్యాయ వృత్తి కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

# తిరుపతి డివిజన్

### కూటమి ప్రభుత్వంలో 23 నెలలో

## సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్

- రాష్ట నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం



తిరుపతి హెల్త్, మే 9, ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలో కూటమి పాలనలో 23 నెలల ప్రజా సంక్షేమం, అభివృద్ధిలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దంపూర్ భాస్కర్ యాదవ్ వెల్లడించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల అమలుపై హామీ ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఇందులో భాగంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పథకం కింద ఇప్పటివరకు 63 వేల కోట్లకు పైగా పెన్షన్లను ఇవ్వడం జరిగిందని చెప్పారు. అలాగే తల్లికి వందనం కింద ఇంటిలో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంతమందికి అంటే ఇప్పటివరకు 67.27 లక్షల మంది విద్యార్థులకు 10,090 కోట్ల రూపాయలను అందించడం జరిగింది అన్నారు. రాష్ట్రంలో మహిళల కోసం స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేసి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 6వ తేదీ వరకు 63.61 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడం జరిగిందన్నారు. ఇది ఒక రికార్డ్ అని ఆయన తెలిపారు. అలాగే మత్స్యకారుల సంక్షేమం కోసం ఏడాదికి 20 వేలు చొప్పున 1.25 లక్షల మంది మత్స్యకారులకు ఇప్పటివరకు 250 కోట్లు అందించి ఆదుకోవడం జరిగిందన్నారు. ఎండోమెంట్ 6ఎ కు సంబంధించి 44 దేవాలయాలలో పనిచేసే నాయి బ్రాహ్మణులకు వేతనం నెలకు 25 వేలకు పెంచడం జరిగిందన్నారు. అలాగే నాయీబ్రాహ్మణ సెలూన్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నారన్నారు. గీత కార్మికుల సంక్షేమం అభివృద్ధి కోసం మద్యం షాపులలో 10 కేటాయించడం జరిగిందని చెప్పారు. రాష్ట్రంలో చేనేత కార్మికుల మగ్గాల కు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను అందించడం, రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ ప్రభుత్వము చేపట్టని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ప్రజల మన్ననలు అందుకుంటోందని కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం వివరించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దంపూరి భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ మెగా డీఎస్సీ రిక్రూట్మెంట్ పై తొలి సంతకం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 15,941 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం జరిగిందన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు సొంత ఇల్లు నిర్మించి ఇస్తామన్న హామీలో భాగంగా 23 నెలల్లో 5.5 లక్షల ఇల్లు నిర్మించి ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. విశాఖపట్నంలో 1.35 లక్షల కోట్లతో గూగుల్ ఏఐ డేటా సెంటర్ హబ్‌కు కూటమి ప్రభుత్వ హయాంలోని శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. రాజధానిలో క్వాంటం వ్యాలీకి శంకుస్థాపన చేయడంతో పాటు క్వాంటం రెఫరెన్స్ ఫెలిసిటీ సెంటర్కు ప్రారంభోత్సవం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాక గంగమ్మ గుడి దేవస్థానం మెంబర్ అశోక్, నగర బీసీ సెల్ అధ్యక్షులు విశ్వనాథం, బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర మెంబర్ చిత్రపు హనుమంతరావు, రజక సాధికార కమిటీ రాష్ట్ర మెంబర్ ఎస్ శంకర్, వడ్డెర సాధికార కమిటీ పార్లమెంట్ కన్వీనర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## సత్యవేడు గంగమ్మ జాతర - కట్టుదిట్టమైన భద్రత న ట్రాఫిక్ డైవర్షన్ : సీఐ

సత్యవేడు, మే 9 ప్రభాతవార్త:

సత్యవేడు ప్రాంతంలో జరిగే గంగమ్మజాతర సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, క్రైమ్ నియంత్రణ, లా అండ్ ఆర్డర్‌నిర్వహణపై పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు సత్యవేడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మురళీనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జాతర నేపథ్యంలో రేపటి నుంచి 8 రోజుల పాటు ట్రాఫిక్ డైవర్షన్ అమలు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా 18వ తేదీ వరకు భారీ వాహనాలకు పూర్తిగా అనుమతి ఉండదని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఉండేందుకు ఊత్తుకోట-శ్రీసిటీ, పాలగుంట మార్గాల్లో ప్రత్యేక డైవర్షన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాతర బందోబస్తులో భాగంగా ఇద్దరు సీఐలు, 11 మంది ఎస్‌ఐలు, 30 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 100 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తించనున్నారు. అదనంగా శ్రీసిటీ నుంచి 30 మంది సెక్యూరిటీ సిబ్బంది కూడా సహకరించనున్నారని పేర్కొన్నారు. భక్తుల భద్రత కోసం డ్రోన్ ద్వారా నిరంతర పర్యవేక్షణ కూడా నిర్వహించనున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, మద్యం సేవించి గొడవలు చేయడం, గంజాయి మత్తులో హద్దులు దాటడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఇప్పటికే సమస్యాత్మకంగా ఉండే 20 మంది వ్యక్తుల జాబితా సిద్ధం చేసి ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. జాతర సమయంలో వీధుల్లో పర్యవేక్షణ కోసం ఒక ఎస్‌ఐతో పాటు నలుగురు కానిస్టేబుళ్లు ప్రత్యేకంగా విధులు నిర్వహిస్తారని, మొక్కులు తీర్చుకోవడానికి వేపాకు కట్టుకుని వచ్చే భక్తులకు ప్రత్యేక మార్గం, దర్శనం కోసం వచ్చే భక్తులకు క్యూ పాటించాలని పోలీసులు కోరారు. ప్రజల సౌకర్యార్థం 24,7 హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని, ఎలాంటి సమస్యలు తలెత్తినా 100, 112కు కాల్ చేస్తే ఐదు నిమిషాల్లోనే పోలీసులు స్పందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌ఐ సాయినాథ్‌చౌదరి, ఎస్‌ఐ లావణ్య పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. గంగమ్మజాతర సందర్భంగా భక్తులందరికి శుభాకాంక్షలు తెలియజేస్తూ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు.

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు చెరువు ఆధారం..

## నీటి సంరక్షణ పనులతో భూగర్భ జలాల పెంపే లక్ష్యం..
## జలధార పనులతో ఉపాధి హామీ వేతనదారులకు వరంగా మారిన వి బి జి రామ్ జి పథకం..

తిరుపతి కలెక్టరేట్, మే 9 ప్రభాతవార్త :

భారత దేశంలో చెరువులు కేవలం నీటి వనరులే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, మానవ మనుగడకు, సంస్కృతి పరిరక్షణకు పట్టుకొమ్మలు. ఇవి నీటి నిల్వకు మాత్రమే కాకుండా వరదల ప్రభావం తగ్గించడానికి, పర్యావరణ సమతుల్యానికి, భూగర్భ జలాల సంరక్షణకు అత్యంత కీలకమైనవి.

### ..గంగలపూడి చెరువు పునరుద్ధరణతో 150 ఎకరాల పంటలకు నీరు..

శ్రీకాళహస్తి మండలంలో జలధార - జలహారతి కార్యక్రమం కింద మొత్తం 85 పనులను చేపట్టేందుకు పరిపాలనా అనుమతులు జారీ చేశారు. అందులో 77 ఫీడర్ చానల్స్, 8 నీటి సంరక్షణ కుంటల పనులు చేపట్టనున్నారు. శ్రీకాళహస్తి మండలంలోని గంగలపూడి గ్రామ పంచాయతీలోని గంగలపూడి చెరువులో 30 మీటర్ల పొడవు, 30 మీటర్ల వెడల్పు, 1 మీటర్ లోతుతో రూ.4 లక్షల అంచనా వ్యయంతో నీటి సంరక్షణ కుంట పనిని 75 మంది ఉపాధి హామీ వేతనదారులతో గత 2 వారాలుగా చేపడుతున్నారు. వర్షాల వలన కురిసే నీరు పల్లాం చెరువు నిండి ఫీడర్ చానల్ ద్వారా



గంగల పూడి చెరువుకు చేరుతుంది. ఈ చెరువు నిండడం ద్వారా 15 బోరు బావులు, 4 బావులు రీఛార్జ్ అవుతాయి. గంగలపూడి, వేలవేడు గ్రామాలకు లబ్ధి చేకూరనుంది. ఈ నీటి ద్వారా 150 ఎకరాలలోని ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ఆ నీటి ద్వారా వరి, వేరుశెనగ పంటలను పండించుకుంటారు. జలధార పనులతో ఉపాధి హామీ వేతనదారులకు వి బి జి రామ్ జి పథకం వరంగా మారింది.

### జలధార-జలహారతి తో నీటి నిల్వ, ఉపాధి హామీతో జీవనోపాధి..

గంగల పూడి ఉపాధి హామీ వేతనదారుడు ..కోట చంద్రబాబు మాట్లాడుతూ జలధారజలహారతి కార్యక్రమం కింద తాము నీటి సంరక్షణ కుంట పనిని చేస్తున్నామని ఈ పని తమకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గతంలో వర్షాలు పడినప్పుడు ఆ నీరు వృధా అయ్యేదని, ఈ చెరువులో ప్రస్తుతం నీటి సంరక్షణ పనిని చేపట్టడం వలన వర్షపు నీరు చేరి నీరు నిల్వ ఉంటుందన్నారు. నిల్వ ఉంచిన నీటి ద్వారా చెరువు పరిసర ప్రాంతాల లోని బోర్లలో నీటి మట్టం పెరగడంతో పాటు త్రాగు నీటి కొరత కూడా తీరుతుందన్నారు. గతం లో 100 రోజులు ఉన్న పని దినాలను విబి జి రామ్ జి పథకం కింద 125 రోజులకు పెంచడం వలన పెంచిన రోజులకు మాకు మరింత వేతనం లభిస్తుందన్నారు. ఈ పని చేయడం ద్వారా తమకు రోజుకు రూ.300 నుండి రూ.307 వరకు వేతనం అందుతోందన్నారు. ఈ పనులు కల్పించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలిపారు.

# అడ్డగోలుగా మట్టి తవ్వకాలు..



ఓబులవారిపల్లి మే 9 ప్రభాతవార్త

ఓబులవారిపల్లి మండల పరిధిలోని జిల్లెల్ల మడక చెరువులో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు కేవలం ఒక చెరువు సమస్య కాదు; ఇది ప్రభుత్వ నిబంధనల అమలుపై, అధికార యంత్రాంగం పనితీరుపై పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. చెరువుల నుంచి మట్టి తవ్వకాలపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఏ చెరువులోనైనా మట్టి తీయాలంటే ముందుగా ఇరిగేషన్ శాఖ సాంకేతిక అనుమతి తప్పనిసరి. చెరువు నీటి నిల్వ సామర్థ్యానికి భంగం కలగకూడదు. చెరువు బండ, కట్ట, ఫీడర్ ఛానళ్లకు నష్టం కలగకుండా పరిమిత స్థాయిలో మాత్రమే మట్టి తొలగించాలి. కానీ జిల్లెల్ల మడక చెరువులో జరుగుతున్న తవ్వకాలను పరిశీలిస్తే ఈ నిబంధనలు పూర్తిగా గాలికొదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మైన్స్ అండ్ జియాలజీ శాఖ నిబంధనల ప్రకారం సహజ వనరుల తవ్వకాలపై సరైన అనుమతులు, రాయల్టీ చెల్లింపులు, పరిమితులు ఉండాలి. అక్రమ తవ్వకాలు జరిగితే వెంటనే సీజ్ చేసి కేసులు నమోదు చేయాల్సిన బాధ్యత ఆ శాఖపై ఉంటుంది. అయినప్పటికీ భారీ యంత్రాలతో రాత్రింబవళ్లు మట్టి తరలింపులు జరుగుతున్నా చర్యలు కనిపించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రెవెన్యూ శాఖకు ప్రభుత్వ భూముల పరిరక్షణ ప్రధాన బాధ్యత. చెరువులు, కుంటలు, వాగులు ప్రభుత్వ ఆస్తులుగా పరిగణించబడతాయి. అలాంటి ప్రదేశాల్లో అక్రమ కార్యకలాపాలు జరిగితే వెంటనే అడ్డుకోవాలి. అవసరమైతే పోలీసు సహకారంతో యంత్రాలను స్వాధీనం చేసుకోవాలి. కానీ ఇక్కడ మాత్రం అధికారులు మౌనంగా ఉండటం ప్రజల్లో అనుమానాలను మరింత పెంచుతోంది.ట్రాన్స్‌పోర్ట్ శాఖ మట్టి తరలిస్తున్న భారీ వాహనాలకు సరైన పర్మిట్లు ఉన్నాయా? ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఉన్నాయా? అనే అంశాలను తనిఖీ చేయడం ఆ శాఖ బాధ్యత. ప్రతిరోజూ పది నుంచి ఇరవై వరకు వాహనాలు చెరువు నుంచి మట్టిని తరలిస్తున్నా ఒక్క తనిఖీ కూడా జరగకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. ఇరిగేషన్ శాఖకు చెరువుల సంరక్షణ అత్యంత కీలక బాధ్యత. చెరువు లోతు, నిల్వ సామర్థ్యం, బండల భద్రత వంటి అంశాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలి. అక్రమ తవ్వకాల వల్ల చెరువుల నిర్మాణం దెబ్బతింటే భవిష్యత్తులో నీటి నిల్వలు తగ్గిపోవడంతో పాటు రైతాంగం తీవ్రంగా నష్టపోతుంది. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడం విచారకరం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ తవ్వకాలపై సమగ్ర విచారణ చేపట్టాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై మాత్రమే కాకుండా విధుల్లో నిరక్ష ్యంల్లో వహించిన అధికారులపై కూడా చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుంది. లేదంటే చెరువులు ఖాళీ అవుతాయి.. ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల విశ్వాసం కూడా అలాగే కరిగిపోతుంది.

## కాలభైరవ స్వామికి పుష్పాలంకరణ

పుత్తూరు రూరల్, మే 9 ప్రభాతవార్త:

నగరి పట్టణంలో వెలసి ఉన్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో శనివారం విశేష అష్టమి పూజలు వైభవంగా జరిగాయి. స్వామివారికి పాలు, పంచామృతం, తేనె, పాలు, పెరుగు, రకాలైన సుగంధ ద్రవ్యాలు చందనం, విభూది, పన్నీరు తదితర వాటితో విశేషంగా అభిషేక, అర్చన జరిగాయి. తదుపరి పుష్పమాలలతో ప్రత్యేక అలంకరణ జరిగింది. భక్తులకు కనువిందుగా ప్రత్యేకంగా పుష్పార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉభయ దారులు, ఆలయ నిర్వాహకులు, కమిటీ సేవా సభ్యులు పాల్గొన్నారు.

# నిలువు దోపిడి

- డెలవరీ ఛార్జీల పేరిట ఒక సిలెండర్‌పై రూ.40 నుండి రూ.50 వసూలు
- బ్లాక్‌లో రూ.1,200లకు వంట గ్యాస్ సిలెండర్ విక్రయాలు
- ఎల్‌పిజి గ్యాస్ వినియోగదారులతో ఆడుకుంటున్న ఏజెన్సీలు

చిత్తూరు, మే 9 ప్రభాతవార్త:

జిల్లాలో వంట గ్యాస్ వినియోగదారులు ఏజెన్సీల నిలువు దోపిడికి గురవుతున్నారు. ఎల్పిజి గ్యాస్ సిలెండర్ డెలవరీ చేసిన సమయంలో వినియోగదారుల నుండి ఒక సిలెండర్‌కు రూ.947 మాత్రమే వసూలు చేయాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేస్తున్నప్పటికీ ఏజెన్సీల ఆధ్వర్యంలోని సిలెండర్ల డెలవరీ బాయ్‌లు వినియోగదారుల నుండి ఒక సిలెండర్‌పై రూ.40 నుండి రూ.50 వసూలు చేసి దండుకుంటున్నారు. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం ఫలితంగా దేశ వ్యాప్తంగా ఎల్పిజి గ్యాస్ కొరత ఏర్పడటంతో అప్పటి వరకు వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా లభ్యం అవుతున్న ఎల్పిజి గ్యాస్ సిలెండర్లు లభించడం కష్టం అయ్యింది. మరోవైపు కమర్షియల్ గ్యాస్ సిలెండర్ల సరఫరాను కట్టడి చేయడంతో హోటళ్ళు, టీ దుకాణాలు, హాస్టళ్ళు తదితరాలు నిర్వహించే వారికి సైతం కష్టంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఎల్పిజి గ్యాస్ సిలెండర్లు బుక్ చేసిన వినియోగదారులు గ్యాస్ డెలవరీ బాయ్ వద్దకు వచ్చి ఓటిపి చెప్తే కాని బుకింగ్ చేసిన ఫుల్ సిలెండర్ ఇచ్చే పరిస్థితి కన్పించని పరిస్థితి నెలకొంది. ఎల్పిజి గ్యాస్ కొరతను తమకు అనుకూలంగా మలచుకుని లబ్ది పొందాలని కొంత మంది గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు, డెలవరీ బాయ్‌లు భావించడంతో మార్కెట్‌లో ఎల్పిజి గ్యాస్ సిలెండర్ల ధరకు రెక్కలు



వచ్చాయి. గ్యాస్ ఏజెన్సీ నుండి 5 కిమీలోపు దూరం వుంటే గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల నుండి అదనంగా ఒక్క పైసా వసూలు చేయరాదు. కేవలం ప్రభుత్వం నిర్ధేశించిన ధర ఒక ఎల్పిజి గ్యాస్ సిలెండర్‌పై రూ.947 మాత్రమే వసూలు చేయాలి. అలాగే 5 కిమీ కంటే ఎక్కువ దూరం వుంటే వినియోగదారుల నుండి రూ.20 వసూలు చేసుకోవచ్చునని గతంలో నిబంధన వుండేది. అయితే ప్రస్తుతం ఈ నిబంధనను సైతం కేంద్ర ప్రభుత్వం ఎత్తివేయడంతో గ్యాస్ ఏజెన్సీలు, డెలవరీ బాయ్‌లు వినియోగదారుల నుండి గ్యాస్ సిలెండర్ ధర కంటే అదనంగా ఒక్క పైసా వసూలు చేయడానికి వీలు లేదు. అయితే జిల్లాలో కొంతమంది గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, డెలవరీ బాయ్‌లు వినియోగదారుల నుండి వసూలు చేయాల్సిన మొత్తం కంటే అధికంగా డబ్బులు వసూలు చేసి దండుకుంటున్నారు. జిల్లాలో కమర్షియల్ గ్యాస్ కొరత నెలకొనడంతో అత్యధిక ఏజెన్సీల్లో విధులు నిర్వహిస్తున్న డెలవరీ బాయ్‌లు ఒక సిలెండర్‌ను రూ.1,200లకు బ్లాక్‌లో విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. చిత్తూరు జిల్లాలో మొత్తం 42 గ్యాస్ ఏజెన్సీలు వున్నాయి. ఇందులో ఇండియన్, హెచ్‌పి, భారత్ గ్యాస్ ఏజెన్సీలు వున్నాయి. ఇందులో ఇండియన్, హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీలకు సరఫరా బాగుండటంతో వీటి వినియోగదారులు పెద్దగా ఇబ్బందులు పడటం లేదు.

అయితే భారత్ గ్యాస్ సరఫరా సక్రమంగా జరుగకపోవడంతో ఈ గ్యాస్ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఎల్పిజి గ్యాస్ వినియోగదారులు డెలవరీ బాయ్స్‌కు అదనంగా రూ.50 నుండి రూ.100 వరకు టిప్స్‌గా ఇచ్చివేస్తారు. పట్టణ ప్రాంతాల్లో గ్యాస్ సరఫరా చేసే డెలవరీ బాయ్‌కు రోజు మంది ఆదాయం వుంటుంది. పట్టణ ప్రాంతాల్లోని వినియోగదారులు సైతం తాము డెలవరీ బాయ్స్‌కు ఎక్కువ మొత్తం డబ్బులు ఇచ్చినట్లు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు ఫిర్యాదు సైతం చేయరు. అయితే పట్టణ ప్రాంతాల నుండి గ్రామీణ ప్రాంతాలకు ఎల్పిజి గ్యాస్ సరఫరా చేసే డెలవరీ బాయ్స్‌కు ఆశించిన ఆదాయం వుండదు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్ధేశించిన ధర మాత్రమే వినియోగదారులు చెల్లిస్తుండటంతో వీరు భర్తీ సిలెండర్లకు బ్లాక్ మార్కెట్‌కు తరలించి ఎంతో కొంత ఆదాయం జేబుల్లో వేసుకుంటున్నారు. అలాగే మండల కేంద్రాల్లో వున్న గ్యాస్ ఏజెన్సీలు సైతం గ్యాస్ ఏజెన్సీలు వున్న ప్రదేశంలో వినియోగదారులకు గ్యాస్ సిలెండర్లను పంపిణీ చేయకుండా కొంత దూర ప్రాంతంకు తీసుకెళ్ళి అక్కడ వుంచి వారి నుండి ఒకొక్క సిలెండర్‌పై డెలవరీ ఛార్జీల కింద రూ.30 నుండి 50 వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# తిరుపతి డివిజన్

## ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ




తొట్టంబేడు,మే 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి ఏపియస్ఆర్‌టిసిలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు అభినందన సభను శనివారం నిర్వహించారు. డిపో మేనేజర్ ఎం.రేవతి అధ్యక్షతన జరిగిన సభలో డిపో గ్యారేజి,ఆవరణలో సన్మాన సభను ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా డ్రైవర్లలో వి.షణ్ముగం ఘాట్ సర్వీసులో హై ఇపికే 78.04 సాధించినందుకు ఆయన్ను సత్కరించారు. అల్ట్ డీలక్సు బస్సు సర్వీసులో ప్రగతి సాధించిన టి.మధు సూపర్‌లగ్జారి సర్వీసులో 41.51ఇపికె సాధించిన ఎస్ శంకర్‌లాల్, కండక్టర్లు ఎస్‌వి సిద్దులు పిబియస్ మణ్యం జి.నిర్మల హైఇపికె సాధించారన్నారు. ఈ కార్యక్రమాల్లో అసిస్టెంట్ మేనేజర్ డి.చిట్టెమ్మ, ఎంఎఫ్ ఏ.చక్రవర్తి, యూనియన్ నాయకులు,సిబ్బంది పాల్గొన్నారు.

## గుడిమల్లం ఆలయంలో చీఫ్ ఇంజనీర్ పూజలు



ఏర్పేడు,మే 9 ప్రభాతవార్త: మహిమాన్వితమైన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో శనివారం విజయవాడ పంచాయతీరాజ్ శాఖ చీఫ్ ఇంజనీర్ శివకుమార్ కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు. వీరికి ఆలయ చైర్మెన్ బత్తల గిరినాయుడు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఇటీవల ఆలయం కుంబాభిషేకం నిర్వహించిన తరువాత భకక్తులతో పాటు విఐపిల తాకిడి పెరుగుతుంది. అతి పురాతనమైన ఆలయంలో వెలసిన పరశురామేశ్వరుని దర్శనం కోసం అతిథులు అధికంగా వస్తున్నారు.ఈ నేపధ్యంలో శివకుమార్ కుటుంబానికి చైర్మెన్ గిరినాయుడు, ఇఓ మునిశేఖర్‌లు స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు వంశీ వారికి ప్రత్యేకాశీర్వ చనాలు అందించారు.

## గంగమ్మకు ఉద్యోగ సంఘాల నాయకుల సారె



తిరుపతి,మే 9ప్రభాతవార్త: తాతయ్యగుంట గంగమ్మకు జాతర సందర్భంగా టిటిడి ఉద్యోగుల సంక్షేమ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం భక్తిశ్రద్ధలతో, మేళతాళాల నడుమ, ఉద్యోగులు కుటుంబ సభ్యుల ఆధ్యాత్మిక కోలాహలంతో తుడా కార్యాలయం నుండి తాతయ్యగుంట గంగమ్మ తల్లి దేవాలయం వరకు ఘనంగా పాదయాత్ర నిర్వహించి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

మహానాడు కమిటీలో

## మీడియా కోఆర్డినేట్ సభ్యుడిగా శ్రీధర్‌వర్మ



తిరుపతి,మే 9ప్రభాతవార్త: నెల్లూరులో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు పండుగకు మీడియా కమిటీ సభ్యుల్లో శ్రీధర్ వర్మను ఎంపిక చేశారు. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ప ల్లా శ్రీనివాసరావు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ వర్మ మాట్లాడుతూ తనపై బాధ్యతతో నెల్లూరులో జరుగునున్న 27,28,29తేదీల్లో మహానాడు పండుగకు మీడియా కమిటీ సభ్యుడిగా ఎంపిక చేయడం పట్ల పార్టీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ పార్టీ కోసం తాను మరింత బాధ్యతగా పనిచేస్తానని తెలియజేశారు.

## భారత ఎన్నికల కమిషనర్ కు ఘన స్వాగతం



రేణిగుంట మే 9 ప్రభాతవార్త భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేష్ కుమార్ దంపతులకు రేణిగుంట విమానాశ్రయంలో శనివారం అపూర్వ స్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం సతీసమేతంగా రేణిగుంట చేరుకున్న భారత చీఫ్ ఎన్నికల కమిషనర్ గ్యానేష్ కుమార్ కు విమానాశ్రయంలో అపూర్వ స్వాగతం అందుకున్నారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, తిరుపతి అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, తహసిల్దార్ శ్యాం ప్రసాద్ తదితరులు ఉన్నారు. అనంతరం ఆయన కాన్వాయ్ తో తిరుచానూరు అమ్మవారి దర్శనానికి బయలుదేరి వెళ్లారు..

## గణనాథుని సన్నిధిలో పలువురు ప్రముఖులు



కాణిపాకం, మే 9 ప్రభాతవార్త : కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈ మేరకు ఏపీ పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ బాలు నాయక్, ఏపీ రాష్ట్ర వ్యవసాయం మరియు సహకార శాఖ డిప్యూటీ సెక్రటరీ డి.హరిత, శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, ప్రముఖ దర్శకుడు మోహన్



రమేష్, ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయ మూర్తులు జస్టిస్ సుభేందు సమంత, జస్టిస్ మండల కిరణమయి లు వేర్వేరుగా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి దేవస్థానం చైర్మన్ వి మణి నాయుడు, ఆలయ ఏఈవోలు రవీంద్రబాబు, ధనపాల్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం



వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి వేద మండపంలో ఆశీర్వచనం చేసి స్వామి వారి శేష వస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాలను అందజేశారు. వారి వెంట ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు బాలాజీ నాయుడు,రవి, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# వ్యాసాశ్రమం పరిపాలనపై...రాష్ట్రపతికి ఫిర్యాదు?!



ఏర్పేడు,మే 9 ప్రభాతవార్త: ఆధ్యాత్మిక దివ్యక్షేత్రంగా వెలసిన మళయాళ సద్గురు స్థాపించిన శ్రీ వ్యాసాశ్రమం వివాదాలకు నిలయంగా మారింది. ఈ నేపధ్యంలో శనివారం మండల కేంద్రానికి చెందిన గాలి రవి రాష్ట్రపతికి పిర్యాదు చేస్తూ మీడియాకు తెలిపారు. ఆధ్యాత్మికతకు నిలయంగా విరాలజిల్లి మహిళలకు సంస్కృత విద్యను అందించిన మహానీయుడు మళయాళ యతీంద్రుల సారథ్యంలో స్థాపించిన ఆశ్రమం ఒక రోజు చుట్టుపక్కల గ్రామాలకే కాకుండా దేశ విదేశాల్లో ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించిందన్నారు. అయితే ప్రస్తుత పీఠాధిపతి పర్యవేక్షణలో ఆశ్రమంలో భారీ స్థాయిలో అవినీతి పెరిగిందని ఆరోపించారు. సుమారు 15సంవత్సరాలుగా అవినీతి అక్రమాలకు నిలయంగా మారిన ఆశ్రమం నిర్వాహకులపై విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేసారు. ఆశ్రమానికి సంబంధించిన సుమారు 40 నుంచి రూ.50కోట్లు ఫిక్సడ్ డిపాజిట్లు దేవాదాయశాఖ అనుమతి లేకుండా డ్రా చేసారని ఆరోపించారు. విరాళాల సొమ్ములకు లెక్కల్లేదన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఆస్తుల అమ్మకం జరుగుతుందని ఆరోపించారు. దేవాదాయశాఖ నిబంధనలకు విరుద్ధంగా అమందూరులోని క్వార్టర్స్ తోపాటు చిత్తూరులోని పరాశర్య ప్రింగింగ్ ప్రెస్‌ను ప్రవైటు వ్యక్తులకు విక్రయించారని ఆరోపించారు. ఇక సమాజ సేవకు ఏర్పాటు చేసిన ఆశ్రమం లోని సేవా సంస్థలకు సంబందించి మూసివేసారని పేదలకు ఉపయోగపడే కంటి ఆసుపత్రి, అనాధశరణాల యం, సంస్కృత పాఠశాలలను మూసివేయటం ఆశ్రమ లక్ష్యాలకు విరుద్ధం అన్నారు. ప్రభుత్వం ఆశ్రమాన్ని స్వాధీనం చేసుకొని ఇక్కడ జరిగిన అకృత్యాలు, అక్రమ అమ్మకాలపై ఆర్థిక లావాదేవిలపై విజిలెన్స్ అదికారులచే సమగ్ర విచారణకు రాష్ట్రపతి ఆదేశించాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్లు గాలి రవి వివరించారు.

## కుక్కలకు కు.ని ఆపరేషన్లు

### రూ.25లక్షలతో ఆపరేషన్ థియేటర్:మున్సిపల్ కమిషనర్



శ్రీకాళహస్తి,మే 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో రోజు రోజుకు వీధుల్లో కుక్కల బాధ పెరిగిపోతుందని ప్రజల నుంచి ప్రతి రోజూ వస్తున్న ఫిర్యాదులతో ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ శనివారం వివరించారు.ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తిలో కుక్కల సంతంతి పెరగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.ఈ నేపధ్యంలో కుక్కలకు కు.ని ఆపరేషన్లు నిర్వహించుటకు కొత్త ఆపరేషన్ థియేటర్‌ను నిర్మిస్తున్నట్లు వివరించారు. శ్రీకాళహస్తి చెన్నై మార్గంలోని తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కనే ఆపరేషన్ థియేటర్‌ను రూ.25లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. గతంలో తిరుపతికి తరలించే వారని ఒక్కొక్క కుక్కకు రూ.1600లు ఖర్చు అయ్యేదన్నారు.మున్సిపల్ ఫిల్టర్ హౌస్ వద్ద ఆపరేషన్ థియేటర్‌ను నిర్మించి పట్టణంలోని కుక్కలను పట్టి అక్కడకు చేర్చి కు.ని ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు. నాలుగురోజులు అక్కడ అబజర్ వేషనలో ఉంచుకొని ఆపరేషన్ చేసిన కుక్కకు ట్యాగ్ వేస్తామన్నారు.నాలుగు రో జుల తరువాత ఆపరేషన్ చేసిన కుక్కను యథా స్థానంలో వదలి పెడతామన్నారు. నాలుగు రోజుల పాటు ఆపరేషన్ చేసిన కుక్కలకు ఆహారం సరఫరా చేస్తామన్నారు. దాంతో కుక్కల సంతతి పెరగదని వివరించారు.

## శ్రీకాళహస్తిలో సోమనాధ స్వాభిమాన్‌పర్వ్ సంబరాలు



శ్రీకాళహస్తి,మే 9 ప్రభాతవార్త: ఆధ్యాత్మిక చింతన, దార్మిక కార్యక్రమాలకు వేదికగా ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో ఈ నెల 11న సోమనాధ్ అభిమాన్ పర్వ్ సంబరాలు నిర్వహిం చుటకు ప్రణాళిక రూపొందించినట్లు ఆలయ ఇఓ బికె వెంకటేశులు శనివారం తెలిపారు. సోమనాధ ఆలయంపై దాడి జరిగి వెయ్యి ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంయుక్తంగా సోమనాధ్ స్వాభిమాన్ పర్వ్ అఖండ విశ్వాసం సార్మర కోత్సవాలను ఆయన తెలిపారు. ఆరోజు ఉదయం 8 నుంచి 9గంటల వరకు పుష్పాలంకృత ధర్మప్రచార రథంతో నాలుగుమాడావీధుల్లో ఊరేగింపుతో పాటు కళాకారుల భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాలు, శివసేవకుల 'ఓం' జెండాల ప్రదర్శనల మధ్య సోమనాధస్వామి చిత్రపటాన్ని శోభాయాత్ర నిర్వహించ బడుతుందని వివరించారు. అలాగే 9-10గంటల మధ్య భక్తులం దరితో కలసి ఓం కార జపం సోమనాధ సంకల్పం,సోమనాధ గీతాలాపన ఏర్పాటు చేసినట్లు ఇఓ వెంకటేశులు తెలిపారు. సాంస్కృతిక వేదిక వద్ద వేదపండితులచే జ్యోతి ప్రజాల్వన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. వచ్చిన ప్రతి భక్తునికిలడ్డు ప్రసాద వితరణ ఉంటుందన్నారు. 10 నుంచి 12గంటల మధ్య సోమనాధ ఆలయం నుంచి జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రధాన కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసినట్లు ఇఓ తెలిపారు.ఈ కార్యక్రమాల్లో భక్తులు విరివిగా పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.

## శివయ్య సేవలో నర్సాపూర్ ఎంఎల్‌ఏ పూజలు



శ్రీకాళహస్తి,మే 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువు వాయు లింగేశ్వరుని సన్నిధిలో శనివారం నరసాపూర్ శాసనసభ్యుడు ప్రభుత్వ చీఫ్ విప్ బొమ్మిడి నాయికర్ కుటుంబసభ్యులతో రాహుకేతుదోష నివారణ పూజలను జరిపించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ఎపిఆర్‌ఓ మహేష్ వేదపండితులతో స్వాగతం పలికారు. ఎంఎల్‌ఏ ఆలయానికి వచ్చిన తరువాత తాము మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరారు. దాంతో విద్యాసాగర్‌రెడ్డి సహస్రలింగేశ్వరాయం వద్దఏర్పాట్లు చేసారు. రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్న వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఏర్పాట్లును ఆలయ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామి, పర్యవేక్షకుడు నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు.

## శ్రీకాళహస్తిని చల్లబరచిన వరుణుడు



శ్రీకాళహస్తి,మే 9 ప్రభాతవార్త: ఎండలతో భగ భగ మండుతున్న శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంపై వరుణుడు కరుణించాడు. రెండు రోజుల నుంచి మేఘావృతమైన ఆకాశంలో మేఘాలు శనివారం మధ్యాహం ఉరిమింది. ఎండ వేడిమితో తల్లడిల్లుతున్న ప్రజలు శివభక్తులపై వరుణుడు కరుణించాడు. ఒక్కసారిగా గాలులతో ఽకూడిన వర్షం కురిసింది. సుమారు గంట పాటు తెరపలు తెరపలుగా వాన కురవటంతో వాతావరణం కొంత చల్లబడింది. వేసవి ఎండలతో సతమతమౌతున్న ప్రజలు హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే గాలులతో కొతకు వచ్చిన మామిడి కొన్ని చోట్ల రాలిపోయాయి.

## ప్రజల నిర్లక్ష్యం...మురుగు ప్రవాహానికి గ్రహణం



శ్రీకాళహస్తి,మే 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పురపాలకసంఘ పరిధిలో మురుగు నీటి కాలువల ఆక్రమణల పర్వం ఓ వైపు దుకాణ దారుల వ్యర్థాలను కాలువల్లో వేయటంతో మురుగునీరు ముందుకు సాగక అడ్డంకిగా మారింది. అంతేకాక మురుగునీటి కాలువలు పూర్తిగా వ్యర్థాలతో నిండాయి. అయితే అధికారులు, ప్రభుత్వం ఎంత చైతన్యం కల్గిస్తున్నా ప్రజలు పట్టించుకోవటం లేదు. వ్యాపారస్తులు స్పందించటం లేదు.దాంతో మురుగునీటి కాలువలు దుర్గంధాన్ని వెదజల్లుతుండగా దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి.సమాజానికి మేలు చేయకుంటే పర్వాలేదు కానీ నష్టాన్ని కల్గించే పనులు చేయవద్దంటూ నాయకులు అదికారులు ఎంత చైతన్యవంతుల్ని చేస్తున్నా సహాకరించకపోవటం శోచనీయం అని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహాక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు శనివారం మీడియా సమావేశంలో శివమెత్తారు.శీతల పానీయాల ఖాళీ సిసాలు, ప్లాస్టిక్ సంచులు,ఖాళీ సిమెంటు సంచులు ఇతర వ్యర్థాలతో జయరామారావు వీధి శ్రీరామమందిరం వద్ద కాలువ పరిస్థితి దయనీయంగా మారింది. ఓ వైపు కాలువల్లోనూ మరో వైపు రోడ్లపై విసిరి అస్తవ్యస్తంగా మార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. జయరామారావు వీధిలో కాలువలపై ఆక్రమణలను ఎన్ని సార్లు తొలిగిస్తున్నా మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకుండా మళ్ళీ మళ్ళీ రోడ్లమీదకు వ్యాపారాలు విస్తరిస్తున్నాయి.దాంతో ఓ వైపు ట్రాఫిక్‌కు అంతరాయం మరో వైపు మురుగునీటి కాలువల్లో వ్యర్థాలతో మురుగు సాగటం లేదని ఆయన వివరించారు.పట్టణంలో పారిశుధ్యానికి సంబంధించి మున్సిపల్ అధికారులతో ప్రజలు సహాకరించాలి. అలాగే మున్సిపల్ పారిశుద్ధ్య శాఖ మొక్కుబడిగా కాలువల్లో చెత్తలు నిండినపుడు తూ తూ మంత్రంగా కాకుండా ప్రధాన వీధి కాబట్టి పర్మనెంట్ వర్కర్లను నియమించాలని ఆయన సూచించారు.

## పరశురామేశ్వరుని సేవలో ప్రభాస్ కుటుంబం



ఏర్పేడు,మే 9 ప్రభాతవార్త: గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరుని సన్నిధికి అతిధుల తాకిడి పెరుగుతుంది. ఈ నేపధ్యంలో శనివారం సినీ నటులు ప్రభాస్ కుటుంబానికి చెందిన సభ్యులు స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. వారికి ఆలయ మర్యాదలతో దర్మకర్తల మండలి చైర్మెన్ బత్తల గిరిబాబు నాయుడు,వేదపండితులు వంశీ స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనానికి ఏర్పాట్లు చేసారు. ప్రభాస్ పెద్దమ్మ శ్యామలా దేవి కుటుంబసభ్యులతో హాజర య్యారు. దర్శనానంతరం వారికి వేదపండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించగా చైర్మెన్ గిరినాయుడు తీర్థ ప్రసాదాలను అందించారు.

## అర్ధనారీశ్వరాలయాన్ని సందర్శించిన ఇఓ



తొట్టంబేడు,మే 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న అర్ధనారీశ్వరాల యాన్ని శనివారం ఇఓ బికె వెంకటేశులు, ఇంజనీరింగ్ అదికారులతో కలసి పరిశీలించారు. ఈ ఆలయాన్ని రూ.2కోట్లతో పునర్నిర్మించారు. మహిమాన్విత మైన అర్ధనారీశ్వరాలయం సువర్ణముఖి నది ఒడ్డున వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు.ఇక్కడి ఆలయంలో లింగం రెండు రంగులతో వెలసింది. ఇది స్వయంభువు లింగంగా చెబుతారు. ఈ ఆలయాన్ని బాగు చేయుటకు రూ.2కోట్లు వెచ్చించారు.ఈ ఆలయానికి మడి మాన్యాలు కూడా ఉన్నాయి. బైపాస్‌రోడ్డుఉత్తరంగా వెలసిన ఆలయానికి ప్రధాన రోజుల్లోనే కాకుండా సోమవారం అత్యధికంగా భక్తులు చుట్టుపక్కల నుంచి వస్తారు. ఇటీవల నిర్మించిన శివం టు శివం రోడ్డు నిర్మాణానికి సంబంధించిన పనులు పూర్తి కావస్తున్న తరుణంలో ఇఓ బికె వవెంకటేశులు ఇంజనీరింగ్ అధి కారులు ఇఇ శ్రీనివాసరాజు, డిఇఇ శ్రీనివాసులురెడ్డలతో కలసి రోడ్డు పనులను పరిశీలించిన ఆయన అలాగే ఆలయంలో వెలసిన స్వయంభువును దర్శించుకొని పూజలు జరిపించుకున్నారు. ఆలయ పూజారి ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించారు.మరమ్మతులు చేసిన ఆలయం కొత్త శోభ సంతరించుకకుంది,

## శివయ్య సేవలో బొమ్మిడి నాయక్



శ్రీకాళహస్తి,మే 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని సేవలో శనివారం సరసాపురం జనసేన శాసన సభ్యుడు బొమ్మిడి నాయక్ హాజరయ్యారు. ఆయనకు ఆలయం వద్ద ఆలయ మర్యాదలతో జనసేన నాయకులు స్వాగతం పలికారు.ఆలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరారు. వారికివెంటనే ఆలయాధికారులు సహస్రలింగేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసారు.పూజల అనంతరం వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. సహస్రలింగేశ్వరాలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. స్వాగతం పలికిన వారిలో టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్ పోలూరు శ్రీనివాసులురెడ్డి, రమణ, బాలాజి,సాయి,లక్ష్మీనారాయణ,ఎస్‌కె ఖాదర్‌బాషా, తొట్టంబేడు బాలయ్య, రాంబత్తయ్య, ఎస్‌కె షాహాబుద్దీన్ రేవంత్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అందరం ఒకే కుటుంబంలా వుండాలి



శ్రీకాళహస్తి,మే 9 ప్రభాతవార్త: పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు కాసరం రమేష్ జన్మన దిన సందర్భంగా వాడ వాడల్లో సామాజిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో అన్నదానాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయ కుమార్ నాయుడు, మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు హాజరయ్యారు.ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసారు.ఈ సందర్భంగా మార్కెటింగ్ కమిటి చైర్మెన్ చెంచయ్యనాయుడు మాట్లాడుతూ పార్టీలో అందరం ఒకే కుటుంబానికి చెందిన వారమన్నారు. ఈ మేరకు కాసరం రమేష్ జన్మదినం సందర్భంగా పార్టీ ప్రముఖులు కంటా రమేష్, పేట బాలాజిరెడ్డి, బాలు డిల్లిబాబు మహేష్, కోరా రాకేష్, ఎంపిశ్రీను, వివేక్ గౌడ్, నవీన్, బాబునాయుడు, బద్రి, పెంచులయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు

## సీనియర్ బిసి నాయకుని పరామర్శ



శ్రీకాళహస్తి,మే 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని వన్నెకుల క్షత్రియుడైన సీనియర్ తెలుగుదేశం నాయకుని శనివారం ఆ పార్టీ ప్రముఖులు పరామర్శించారు. వన్నెకుల క్షత్రియ కులానికి చెందిన చిన్నారెడ్డి తమ పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ ప్రమాదవశాత్తు గాయపడి చెన్నైలో చికిత్స పొందారు. ఆయన్ను రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ జి.ధశరధాచ్చారి డైరెక్టర్ మిన్నల్ రవి, గిరిజన సలహా మండలి సభ్యులు యం.సుబ్బయ్య, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహాక కార్యదర్శి డాక్టర్‌యం. ఉమేష్‌రావు,కార్యదర్శి వజ్రం కిషోర్‌లు పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.